




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 290 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు గురువారం 26 జూన్ 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 290 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE THU 26 JUNE 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# గత ఐదేళ్ల పాలనను మర్చిపోండి..
# భయాలకు తావులేదు

## : పారిశ్రామికవేత్తల సమావేశంలో చంద్రబాబు

- వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలకు అధిక ప్రోత్సాహకాలు అందిస్తామన్న ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడి
- టెక్నాలజీతో సుపరిపాలన, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్న ముఖ్యమంత్రి
- సంపద సృష్టి ద్వారా పేదలకు సంక్షేమం అందించడమే ధ్యేయమన్న చంద్రబాబు






**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు నెలకొల్పే పరిశ్రమలకు అధిక ప్రోత్సాహకాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను, ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆయన వివరించారు. గత ఐదేళ్ల పాలన తాలూకు చేదు అనుభవాలను పెట్టుబడిదారులు మరిచిపోవాలని, ఇకపై అలాంటి భయాలకు తావులేదని చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు పెట్టుబడులను ఆకర్షించేలా నూతన విధానాలు తీసుకొస్తున్నామని తెలిపారు. "ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో పెట్టుబడులు పెట్టండి. రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, హైటెక్ పరిశ్రమలకు అనువుగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు గూగుల్ వంటి సంస్థలు రానున్నాయి, విశాఖ కేంద్రంగా సీ-కేబుల్ కూడా ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని, అమరావతి పరిసరాల్లో కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్స్‌పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టి జరగాలని, ఆ సంపదను పేదలకు సంక్షేమ రూపంలో అందించి,

వివరాలు 2లో..

# ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు
- తల్లికి వందనం, మెగా డీఎస్సీ వంటి హామీల అమలు ప్రస్తావన
- అహంకారం వీడి, ఓర్పు సహనంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచన
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఏర్పాటు అన్న మంత్రి
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్న లోకేశ్




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ చేరవేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని ఈ సందర్భంగా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత

వివరాలు 2లో..

# భారత్‌తో చర్చలకు సిద్ధం

## పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

- సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో టెలిఫోన్ సంభాషణ
- వివిధ అంశాలపై చర్చించడానికి పాక్ సుముఖంగా ఉందన్న షరీఫ్
- ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో చర్చలు ఉండవన్న భారత్



**పెన్ పవర్ డెస్క్:**ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేంత వరకు పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు జరిపేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం చర్చల అంశాన్ని పదేపదే లేవనెత్తుతోంది. ఇరు దేశాల మధ్య పరిష్కారం కాని వివాదాలపై

వివరాలు 2లో..

# ఫేమ్ ఉంటే సరిపోదు

## రాజకీయాలపై అవగాహన ఉండాలి: విజయ్ ఆంటోనీ



- రాజకీయాల్లో ఎంట్రీపై విజయ్ ఆంటోనీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్
- రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన తనకు లేదన్న విజయ్ ఆంటోనీ
- ప్రజల మద్దతు ఉంటేనే రాజకీయాల్లో రాణించగలరని వ్యాఖ్య
- ఫేమ్ చూసి రాజకీయాల్లోకి రాలేమన్న హీరో
- సినీ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం ఎప్పటినుంచో ఉందని ఆరోపణ
- విజయ్ నటించిన 'మార్గన్' జూన్ 27న విడుదల

వివరాలు 2లో..

# మళ్లీ అణ్వాయుధ కార్యక్రమాలు చేపడితే తీవ్ర పరిణామాలు

## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



- ఇరాన్ యురేనియం శుద్ధిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- అణ్వాయుధాల జోలికి వెళ్తే మళ్లీ దాడులు తప్పవని వెల్లడి
- ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ విరమణకు పుతిన్ సాయాన్ని తిరస్కరించిన ట్రంప్
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ ప్రకటన

వివరాలు 2లో..

# లిక్కర్ స్కామ్ విచారణకు డుమ్మా కొట్టిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- విచారణకు హాజరయ్యేందుకు మూడు రోజుల గడువు కోరిన మోహిత్ రెడ్డి
- ఈ కేసులో ఏ-39గా ఉన్న మోహిత్
- ఇప్పటికే ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మోహిత్




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణం కేసు దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈరోజు విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ, ఆయన సిట్ ఎదుట హాజరుకాలేదు.

వివరాలు 2లో..

# సింగయ్య మృతి కేసు... క్వాష్ పిటిషన్ వేసిన జగన్

- జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా విషాదం
- జగన్ వాహనం కింద పడి సింగయ్య మృతి
- ఈ కేసులో ఏ2గా జగన్
- ఇప్పటికే డ్రైవర్ అరెస్ట్
- జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనం సీజ్



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ఇటీవలి పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటన సందర్భంగా విషాదకర ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. మొత్తం ముగ్గురు వ్యక్తులు ఈ పర్యటన సందర్భంగా చనిపోయారు. జగన్ వాహనం

వివరాలు 2లో..

# మాకు ఇండియా ఫస్ట్... కొందరికి మోదీ ఫస్ట్



**పెన్ పవర్ డెస్క్:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. "మాకు దేశమే ప్రథమం, కానీ కొందరు వ్యక్తులకు మోదీయే ప్రథమం" అంటూ శశిథరూర్ ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం చేపట్టిన దౌత్యపరమైన చర్యలపై 'ది హిందూ' పత్రికలో శశిథరూర్ రాసిన వ్యాసం చుట్టూ జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాసంలో, ప్రధానమంత్రి మోదీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి "ప్రధాన ఆస్తి"గా నిలుస్తోందని,

వివరాలు 2లో..

- మోదీని పొగిడిన శశిథరూర్‌పై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్‌పై థరూర్ ఆర్టికల్‌తో కాంగ్రెస్‌లో దుమారం
- థరూర్ వ్యాఖ్యలు వ్యక్తిగతమే, పార్టీవి కావన్న కాంగ్రెస్

# శుభాంశు శుక్లా ప్రయాణం ప్రారంభం..
# ఫాల్కన్ 9 టేకాఫ్ సక్సెస్..

- అంతరిక్షంలోకి మామిడి తాండ్ర, పెసరపప్పు హల్వా, క్యారెట్ హల్వా తీసుకెళ్లిన శుక్లా
- 14 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు
- సూక్ష్మ గురుత్వాకర్షణలో మెంతి, పెసర వంటి విత్తనాలు మొలకెత్తే తీరుపై అధ్యయనం



**పెన్ పవర్ డెస్క్:**భారత అంతరిక్ష యాత్రలో చరిత్రాత్మక క్షణం ఆవిష్కృతమైంది.. మన వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ప్రారంభమైంది. అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ 9 రాకెట్ టేకాఫ్ విజయవంతమైంది. శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో

వివరాలు 2లో..

# సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగన్

- వైసీపీలోకి చేరిన టీడీపీ నేత సుగవాసి సుబ్రహ్మణ్యం
- ఉమ్మడి కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ గా పనిచేసిన సుగవాసి
- 2024 ఎన్నికల్లో రాజంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా ఓటమి

వివరాలు 2లో..



# చంద్రబాబు, లోకేశ్ లను తొక్కిపెట్టి నార తీయాలి కదా?

- కూటమి ప్రభుత్వంపై రోజా తీవ్ర విమర్శలు
- మహిళల అక్రమ రవాణాపై పవన్ ఎందుకు స్పందించడం లేదని నిలదీత
- ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమి గెలిచిందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మహిళల అక్రమ రవాణా అంశంపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆమె సూటిగా ప్రశ్నించారు. తమ అధినేత జగన్ సభలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను అడ్డుకునేందుకే ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. తాజాగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన రోజా... కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన "సూపర్ సిక్స్" హామీలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. "పాలనను పక్కనపెట్టి దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై

వివరాలు 2లో..





## ఎడిటర్ వ్యూ

# తొలి అడుగు

**నాడు వైసీపీ.. నేడు టీడీపీ.. సేమ్ టు సేమ్.. సక్సెస్ రేటు ఎంత?**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడూ అంతే. ఒకరు ప్రారంభించిన కార్యక్రమాన్ని మరొకరు మొదలు పెడతారు. ఆ కార్యక్రమం సక్సెస్ అయిందా? లేదా అన్నది చూడరు. 2019 ఎన్నికల్ల వైసీపీ గెలిచిన తర్వాత అనేకసంక్షేమ పథకాలను అమలు చేసింది. దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయల డబ్బులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో వైసీపీ ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యేలను గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేసింది. గడప గడపకు ప్రభుత్వం అని పేరుపెట్టింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే డిజైన్ తో టీడీపీ కార్యక్రమాన్ని సిద్ధం చేసింది.

**విజయయాత్ర పేరుతో...**

ఇంటింటికి తొలి అడుగు విజయయాత్రగా నామకరణం చేసింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు ఆదేశించారు. అంటే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే చాలా వరకూ అమలు చేశామని, పింఛను నాలుగు వేల రూపాయలు ఇవ్వడంతో పాటు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం, తల్లికి వందనం పథకం కింద పదమూడు వేల రూపాయలను ఒక్కొక్కరికి ఇవ్వడంతో పాటు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు అమలు చేస్తామని చెప్పడం వంటివి చేయాలని చంద్రబాబు ఎమ్మెల్యేలకు, ప్రజప్రతినిధులకు చెప్పారు.

**క్షేత్రస్థాయిలో నివేదిక...**

జులై ఒకటో తేదీ నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయిలో నివేదికలను చంద్రబాబు తెప్పించుకుని ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తారట. ఉచిత ఇసుక, మద్యం వంటి విషయాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొనడంతో వారిని కూడా జనం వద్దకు పంపాలన్నది చంద్రబాబు ప్రయత్నం. గత ఏడాది నుంచి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా నియోజకవర్గం పరంగా ఏమి మంచి జరిగిందో జనాలకు వివరించి వారిలో ఏదైనా అసంతృప్తి ఉంటే దానిని తొలగించే ప్రయత్నం చేయాలని చంద్రబాబు ఆలోచన. అయితే జనం నుంచి ఎలాంటి స్పందన వస్తుందన్నది ఎమ్మెల్యేలకు అంతుచిక్కడం లేదు.

**ప్రభుత్వంపై సానుకూలత ఉన్నప్పటికీ...**

చంద్రబాబు చేయించిన సర్వేల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల్లో ఎక్కువగా అసంతృప్తి ఉందని తేలింది. అందులో కొత్తగా ఎన్నికైన దాదాపు ఎనభై మంది ఎమ్మెల్యేల్లో అధిక శాతం కూడా ఉండటంతో వారిని ప్రజలతో మమేకం చేయాలని చంద్రబాబు ఈ కార్యక్రమాన్నితలపెట్టినట్లు కనపడుతుంది. దీంతో పాటు క్యాడర్ ను కూడా కలుపుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనగలిగితే ఎమ్మెల్యేలకు, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ కూడా తొలగిపోతుందని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు హడావిడి కాకుండా నాలుగేళ్ల ముందు నుంచే చర్యలు తీసుకోవడంతో పాటు కార్యకర్తలను కూడా మోటివేట్ చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తుంది. మరి ఈ కార్యక్రమం ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది చూడాల్సి ఉంది.

### శుభాంశు శుక్లా ప్రయాణం ప్రారంభం..

## ఫాల్కన్ 9 టేకాఫ్ సక్సెస్..

- మొదటి పేజీ తరువాయి

ఫాల్కన్ రాకెట్ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరింది. మధ్యాహ్నం 12:01 గంటలకు రాకెట్ టేకాఫ్ అయింది. దాదాపు 28 గంటల పాటు జరగనున్న ఈ ప్రయాణం రేపు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అంతరిక్ష కేంద్రానికి రాకెట్ అనుసంధానంతో ముగుస్తుంది. శుభాంశు శుక్లా బృందం 14 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు చేయనుంది. ఈ చారిత్రక యాక్సియమ్-4 మిషన్ ద్వారా భారత్, పోలాండ్, హంగేరీ దేశాలు 40 ఏళ్లకు పైగా విరామం తర్వాత మానవసహిత అంతరిక్ష యాత్రలను పునఃప్రారంభించాయి. ఈ మూడు దేశాలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఒకేసారి మిషన్ నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. శుభాంశు శుక్లా తన 14 రోజుల అంతరిక్ష పర్యటనలో పలు కీలకమైన శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టనున్నారు. ముఖ్యంగా ఇస్రో-డీబీటీ స్పేస్ న్యూట్రిషన్ ప్రోగ్రామ్ కింద మెంతి, పెసర వంటి భారతీయ ఆహార ధాన్యాల విత్తనాలు సూక్ష్మ గురుత్వాకర్షణలో
ఎలా మొలకెత్తుతాయో అధ్యయనం చేస్తారు. ఈ విత్తనాలను తిరిగి భూమికి తీసుకొచ్చి, వాటి మనుగడ సామర్థ్యాన్ని పరిశీలిస్తారు.

దీర్ఘకాల అంతరిక్ష ప్రయాణాలకు, భవిష్యత్తులో అంతరిక్ష వ్యవసాయానికి ఉపయోగపడే బయో-రీజెనరేటివ్ వ్యవస్థల రూపకల్పనపై కూడా శుక్లా పరిశోధనలు చేస్తారు. నాసా హ్యూమన్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లో భాగంగా వ్యోమగాముల ఆరోగ్యం, సూక్ష్మ గురుత్వాకర్షణకు అనుగుణంగా మారడం వంటి ఐదు సంయుక్త అధ్యయనాల్లోనూ ఆయన పాల్గొంటారు. తనతో పాటు మామిడి తాండ్ర, పెసరపప్పు హల్వా, క్యారెట్ హల్వా వంటి భారతీయ వంటకాలను ఆయన అంతరిక్షంలోకి తీసుకెళ్లారు.

# గత ఐదేళ్ల పాలనను మర్చిపోండి.. భయాలకు తావులేదు

- మొదటి పేజీ తరువాయి

పేదరికం లేని సమాజాన్ని భావితరాలకు అందించడమే తన లక్ష్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో ఐటీతో అభివృద్ధికి బాటలు వేశామని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై దృష్టి సారించామని చెప్పారు. టెక్నాలజీ ద్వారా సామాన్యులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఆయన అన్నారు. ఆర్థిక అసమానతలు
తగ్గించేందుకు పారిశ్రామికవేత్తలు కూడా ముందుకు వచ్చి, సామాజిక బాధ్యతగా పేదలకు సాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగన్

రాయలసీమ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీ అధినేత జగన్ సమక్షంలో ఆయన వైసీపీ కండువా కప్పుకున్నారు. రాజంపేట టీడీపీలో తనకు ఎదురవుతున్న అవమానాల కారణంగానే పార్టీని వీడి, వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు బాలసుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా తెలిపారు. సుగవాసి పాలకొండ్రాయుడి రాజకీయ వారసుడిగా 1995లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన బాలసుబ్రహ్మణ్యం, రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2001లో మరోసారి రాయచోటి జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన రాయచోటి ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇటీవల జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట శాసనసభ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చవిచూశారు. టీడీపీలో తనకు జరుగుతున్న అవమానాలను భరించలేకే ఆయన వైసీపీలో చేరినట్టు తెలిపారు.

## మళ్లీ అణ్వాయుధ కార్యక్రమాలు చేపడితే తీవ్ర పరిణామాలు

ఇరాన్ తన యురేనియం శుద్ధి కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమాల దిశగా అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని, దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ ముఠాల ఆర్థిక వనరులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేసిన ప్రస్తుత తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లో జరిపిన దాడిలో అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రి హతమయ్యారు. ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు నిధులు మళ్లించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు ఇరాన్‌పై మరింత ఒత్తిడిని పెంచేవిగా ఉన్నాయి.

మరోవైపు, డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చేసిన ఒక పోస్ట్ కూడా చర్చనీయాంశమైంది. "ఇరాన్, ఇజ్రాయెల్ రెండు దేశాలు కూడా యుద్ధం ఆగాలని సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణుకేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపాను" అని ట్రంప్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

**పుతిన్ సాయాన్ని తిరస్కరించా: ట్రంప్**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించి సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే, ఆ ప్రతిపాదనను తాను సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. నెదర్లాండ్స్‌లో త్వరలో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమానంలో ఆయన జర్నలిస్టులతో ఈ విషయాలను
పంచుకున్నారు. "రష్యాతో ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని నేను భావిస్తున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధం విషయంలో మీకు ఏమైనా సాయం చేయమంటారా?' అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు మీ సహాయం అవసరం లేదని స్పష్టంగా చెప్పాను. మీ (రష్యా) విషయంలోనే నాకు సహాయం కావాలి" అని పుతిన్‌తో అన్నట్లు ట్రంప్ వివరించారు. నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యే అవకాశాలున్నాయని కూడా ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం జెలెన్‌స్కీ ఎన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పలికి, ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు కృషి చేస్తానని ట్రంప్ ప్రకటించారు. గత వారంలోనే ఈ యుద్ధంలో సుమారు ఆరు వేల మంది సైనికులు మరణించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఫేమ్ ఉంటే సరిపోదు

ప్రముఖ నటుడు విజయ్ ఆంటోనీ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తనకు రాజకీయాలపై పెద్దగా అవగాహన లేదని, ప్రస్తుతానికి ఆ దిశగా ఆలోచనలు లేవని స్పష్టం చేశారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మార్గన్' సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ప్రవేశం గురించి విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ... "నటీనటులు ఏదో ఒక సమయంలో రాజకీయాల్లోకి రావాలన్న నియమమే మీ లేదు. ఒకవేళ ప్రజాసేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి అడుగుపెట్టినా, వారికి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభించాలి. అప్పుడే వారు అధికారంలోకి రాగలుగుతారు. నిజం చెప్పాలంటే, నాకు రాజకీయాలపై అంతగా అవగాహన లేదు. కేవలం ఫేమ్ ఉంది కదా అని రాజకీయాల్లోకి ప్రవేశించలేం. ముందుగా ప్రజల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోగలగాలి" అని అన్నారు.

ఇదే సమయంలో మాదకద్రవ్యాల కేసులో నటుడు శ్రీకాంత్ అరెస్ట్ కావడం పట్ల కూడా విజయ్ ఆంటోనీ స్పందించారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం అనేది కొత్త విషయం కాదని, ఈ సమస్య చాలా కాలంగా ఉందని ఆయన ఆరోపించారు. ఎంతోమంది మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాంత్‌కు సంబంధించిన కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని, ఇందులో నిజానిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.

విజయ్ ఆంటోనీ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాతో విజయ్ మేనల్లుడు అజయ్ ధీషన్ ప్రతినాయకుడిగా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో సముద్రఖని, దీప్షిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

- మొదటి పేజీ తరువాయి

సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేశ్ వెల్లడించారు. "కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాను. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుకుంటాం" అని ఆయన అన్నారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన బాబు సూపర్%-%6, బాబు ష్యూరిటీ%-%భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు ఎన్నికల అనంతరం చేపట్టిన మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని ప్రశంసించారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని గుర్తుచేశారు.

**జులై 2 నుంచి గడపగడపకు వెళ్లండి**

జులై 2వ తేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. "బాబు సూపర్%-%6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నిర్దేశిత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం" అని తెలిపారు.

మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయబోతున్నామని లోకేశ్ ప్రకటించారు.

**అహంకారం వీడండి, ఓర్పుతో ప్రజల్లోకి వెళ్లండి**

ప్రజలు అహంకారాన్ని, ఇగోలను ఏమాత్రం హర్షించరని లోకేశ్ పార్టీ శ్రేణులకు హితవు పలికారు. "గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే వారి సంఖ్య 151 నుంచి 11కి పడిపోయింది. ఏ నాయకుడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుంది. ప్రజల్లోకి వెళ్లి ఓర్పు, సహనంతో వారు చెప్పే సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి కృషిచేయండి" అని సూచించారు. గత ప్రభుత్వం కక్షసాధింపు చర్యగా నిలిపివేసిన ఉపాధి హామీ, నీరు%-%చెట్టు పథకాల బిల్లులను 90 శాతం వరకు క్లియర్ చేశామని, మిగిలిన బిల్లులను కూడా జులైలోగా అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వంటి సమస్యలుంటే మంగళగిరిలోని కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి**

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి దివాలా తీయించిందని లోకేశ్ విమర్శించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ అన్ని విధాలా సహకరిస్తూ రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తున్నారని అన్నారు. అమరావతి, విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్ వంటి అన్ని కీలక అంశాలపై ప్రధాని సానుకూలంగా ఉన్నారని తెలిపారు.

## సింగయ్య మృతి కేసు... క్వాష్ పిటిషన్ వేసిన జగన్

- మొదటి పేజీ తరువాయి

చక్రాల కింద్ర పడి సింగయ్య అనే వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ ఘటనకు సంబంధించి జగన్ తో పాటు, కారు డ్రైవర్, పలువురు వైసీపీ నేతలపై కేసు నమోదయింది. ఈ కేసులో జగన్ ఏ2గా ఉన్నారు. ఇప్పటికే కారు డ్రైవర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్ బుల్లెట్ ప్రూఫ్ కారును కూడా సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ తో పాటు కేసులోని ఇతర నిందితులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. పిటిషన్ ను స్వీకరించిన హైకోర్టు... రేపు విచారణ జరుపుతామని తెలిపింది.

## చంద్రబాబు, లోకేశ లను తొక్కిపెట్టి నార తీయాలి కదా?

- మొదటి పేజీ తరువాయి

ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు" అని రోజా పేర్కొన్నారు. ఎన్నికల్లో జగన్‌ను ప్రజలు ఓడించలేదని, ఈవీఎంలలో జరిగిన గోల్‌మాల్ ద్వారానే ఆయన ఓటమిపాలయ్యారని ఆమె ఆరోపించారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలి. ఈవీఎంలతో గెలిచామన్న అహంకారం వారి మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది" అని రోజా వ్యాఖ్యానించారు. మహిళల అక్రమ రవాణా అంశాన్ని ప్రస్తావిస్తూ... "మహిళల అక్రమ రవాణాపై పవన్ ఎందుకు మాట్లాడటం లేదు? ఇప్పుడు మీ ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా పవన్ కల్యాణ్. మరి ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ లను తొక్కిపెట్టి నార తీయాలి కదా?" అని ఆయనను ఉద్దేశించి ప్రశ్నించారు. వైఎస్ జగన్ నిర్వహించే సభలకు ప్రజలు పెద్దఎత్తున తరలిరాకుండా అడ్డుకోవాలనేది ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, త్వరలోనే వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంటుందని రోజా అభిప్రాయపడ్డారు.

## మాకు ఇండియా ఫస్ట్... కొందరికి మోదీ ఫస్ట్

- మొదటి పేజీ తరువాయి

అయితే దీనికి మరింత మద్దతు అవసరమని థరూర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా... పార్టీ హైకమాండ్ కు, థరూర్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచాయి. పార్టీ లైన్‌కు అనుగుణంగా థరూర్ మాట్లాడకపోవడంపై హైకమాండ్ అసంతృప్తితో ఉంది. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "శశిథరూర్ ఇంగ్లిష్ చాలా ధారాళంగా మాట్లాడతారు. నాకు ఇంగ్లిష్ అంత బాగా రాదు. ఆయన భాష చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించాం" అని అన్నారు. 26 మంది అమాయకులు మరణించిన పహల్గామ్ దాడి తర్వాత, ప్రతిపక్షాలన్నీ సైన్యానికి అండగా నిలుస్తాయని చెప్పాయని ఖర్గే గుర్తుచేశారు. "దేశం ముందు, పార్టీ తర్వాత అన్నాం. కానీ కొందరు వ్యక్తులు 'మోదీ ముందు, దేశం తర్వాత' అని భావిస్తున్నారు. మేమేం చేయగలం?" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఓ కార్యక్రమంలో థరూర్ మాట్లాడుతూ, తాను రాసిన వ్యాసాన్ని తాను బీజేపీలో చేరడానికి చేస్తున్న ప్రయత్నంగా చూడరాదని, అది జాతీయ ఐక్యత, దేశ ప్రయోజనాలు, భారతదేశానికి అండగా నిలవడమనే ఉద్దేశంతో చేసిందని స్పష్టం చేశారు.

### లిక్కర్ స్కామ్ విచారణకు డుమ్మా

## కొట్టిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే, మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం ఈరోజు తమ ఎదుట హాజరు కావాలని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు అందజేశారు. అయితే, వ్యక్తిగత కారణాలతో ఆయన ఈరోజు విచారణకు రాలేదని సమాచారం. విచారణకు హాజరయ్యేందుకు తనకు మూడు రోజుల సమయం కావాలని మోహిత్ రెడ్డి సిట్ అధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఆయన ఏ-39వ నిందితుడిగా ఉన్నారు. మరోవైపు, ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు మోహిత్ రెడ్డి ఇప్పటికే విజయవాడ ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. ఈ మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు, ఆయన బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటేశ్ నాయుడును సిట్ అధికారులు ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ కేసులో తండ్రీకొడుకుల పాత్ర ఉందని సిట్ అధికారులు తమ రిమాండ్ రిపోర్టులో పేర్కొంటూ కోర్టుకు నివేదిక సమర్పించారు. గత శుక్రవారమే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు.

## భారత్‌తో చర్చలకు సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

అర్థవం తమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్మూకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. గతంలో పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది.

పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్, సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది. ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని భారత్ గట్టిగా హెచ్చరించింది.




## పది సంవత్సరాల తర్వాత సహకారమైన

# మహిళా రోగుల కల

**మహిళా డాక్టర్ నియామకం కోసం ఎదురుచూస్తూ కాలం గడిపిన మహిళా రోగులు.**

**కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన మహిళా డాక్టర్ శాంతి.**






**కొమరోలు పెన్ పవర్ జూన్ 25**

గత పది సంవత్సరాలుగా మహిళా డాక్టర్ నియామకం కోసం ఎదురుచూసిన మహిళా రోగుల కల ఎట్టకేలకు సహకారం అయింది. కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా డాక్టర్ లేకపోవడంతో మహిళా రోగులు కొంత ఇబ్బందులకు, అసౌకర్యానికి గురవుతూ వచ్చారు. కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులు, మూడు స్టాఫ్ నర్స్ పోస్టులు, తోపాటు ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ ,ఎఫ్ ఎన్ ఓ, ఎం ఎన్ ఓ ,అటెండర్ ,యు డి సి తదితర పోస్టులు ఉన్నాయి. అయితే రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులలో గతంలో ఒక పోస్టుల మేల్ మెడికల్ ఆఫీసర్ ,మరొక మెడికల్ ఆఫీసర్ పోస్టులో మహిళా డాక్టర్ పనిచేసేవారు. దీనితో మహిళా రోగులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. అయితే గత పది ఏళ్లుగా ఇద్దరు మేల్ మెడికల్ ఆఫీసర్ లే పనిచేస్తూ వచ్చారు. ముగ్గురు స్టాఫ్ నర్స్ లు, ఇద్దరు వైద్యాధికారులు విధులు నిర్వహిస్తూ మహిళా రోగులకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ మహిళా డాక్టర్ లేకపోవడంతో కొందరు మహిళా రోగులు అసౌకర్యానికి గురవుతూ వచ్చారు. గత ఐదేళ్ల క్రితం డాక్టర్ చైతన్య దీపక్, డాక్టర్ అశోక్ లతో రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశారు. కాగా నిన్న మొన్నటి వరకు రాజుపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులలో ఇద్దరు మహిళ డాక్టర్లు పనిచేస్తూ వచ్చారు. కాగా డాక్టర్ అశోక్ బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో మహిళా డాక్టర్ ను నియమిస్తారని మహిళలు ఆశించారు .కాగా కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ గా పని చేస్తున్న డాక్టర్ చైతన్య దీపక్ ను ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా బేస్తవారిపేట మండలం గలిజేర గుళ్ళ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ ఆఫీసర్ గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీ సత్య సాయి జిల్లా వై గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ గా పని చేస్తున్న వీ. శాంతిని కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ ఆఫీసర్ గా బదిలీ చేశారు. దీనితో ఆమె మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గత పది సంవత్సరాలుగా మహిళ మెడికల్ ఆఫీసర్ నియామకం కొరకు ఎదురుచూస్తున్న మహిళా రోగుల కల ఎట్టకేలకు సహకారమైనట్లయింది.

# పెన్ పవర్ ప్రకాశం

## నూరు శాతం ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆదేశం**





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

బడి ఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలోనే వుండాలని, అందుకనుగుణంగా స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ పై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మండల విద్యా శాఖాధికారులతో సమావేశమై స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్, టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్స్, స్కూల్స్ నందు మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో అనేక సంస్కరణలు తీసుకు రావడం జరిగిందన్నారు.జిల్లాలో బడి ఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలోనే వుండాలని, అందుకనుగుణంగా స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ పై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా నాణ్యమైన విద్యనూ అందించేలా కృషి చేయాలన్నారు. ప్రతి స్కూల్ నందు ఒక టీచర్ ను నోడల అధికారిగా నియమించి ఆ స్కూల్ నందు ఉన్న వల్నరబుల్ విద్యార్థులను గుర్తించి వారికి సంబంధించి సమగ్ర వివరాలతో జాబితాను రూపొందించేలా మండల విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ కచితంగా ప్రతి స్కూల్ నందు జరగాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. మండల విద్యా శాఖాధికారులు తమ మండల పరిధిలోని స్కూల్స్ ను సందర్శిస్తూ, విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతూ స్కూల్ లో విద్య ను ఎలా బోధిస్తున్నారు, పాఠ్యాంశాలు అర్థమౌతున్నాయా, టీచర్స్ వలన ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. టీచర్ వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే సంబంధిత టీచర్ పై కచితంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి స్కూల్ నందు ఫిర్యాదుల బాక్స్ ను ఏర్పాటు చేయడంతో పాటు, ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు ఉద్దేశ్యంను ప్రతి విద్యార్థికి తెలిసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ 1వ తరగతి నందు చేర్పించడం, దిగువతరగతి నుండి ఎగువ తరగతికి ప్రమోషన్ చేయడం, డ్రాప్ అవుట్ అయి బడిమానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించడం తదితర విషయాలపై మండల విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, మండల విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి

# ముఖ్యమంత్రి సానుకూలం

**-ప్రతికారంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది**

**- ఒంగోలులో జర్నలిస్ట్ కాలనీ, ప్రెస్ క్లబ్ నిర్మాణం**

**- రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు**

**- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**-ఘనంగా ఏపీయుడబ్ల్యుజే 36వ, రాష్ట్ర మహాసభ**






















**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 25**

పత్రికారంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల ధృక్పధంతో ఉన్నారని పలువురు రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయుడబ్ల్యుజే) 36వ రాష్ట్ర మహాసభ బుధవారం ఒంగోలు దక్షిణ బైపాస్ లోని విష్ణుప్రియ కన్వెన్షన్లో ఘనంగా జరిగింది. ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ లు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని వారి సం క్షేమం కోసం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషిచేస్తుందని చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గ కేంద్రంలో పాత్రికేయులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలు కూడా ఎన్నో వచ్చాయని దీనివల్ల ఏ వార్త అయినా వెంటనే ప్రజల వద్దకు చేరుతుందన్నారు. వార్తల విషయంలో పాత్రికేయులు అదేవిధంగా సామాజిక మాధ్యమాల వారు నిజాయితీగా ఉండాలని, ఫేక్ న్యూస్ ను వ్యాపింపజేస్తే అది సమాజానికి మంచిది కాదని అన్నారు. మంత్రి నిమ్మల రామానాయ ఎడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పాత్రికేయులు పట్టుకొమ్మల్లాంటి వారని అందుకే పత్రికారంగాన్ని ఫోర్త్ ఎస్టేట్గా పిలుస్తారన్నారు. అటువంటి పత్రికారంగం మనుగడ సాగించటానికి తమ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అం దజేస్తుందన్నారు. గత ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆయన పేర్కొన్నారు. పాత్రికేయులకు అక్రిడిషన్ కార్డుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రుల కమిటీని నియమించారని త్వరలో రాష్ట్రంలో అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. అదేవిధంగా పాత్రికేయులకు ఇన్యూరెన్స్, హెల్త్ కార్డుల జారీ, ఇళ్ల స్థలాల మంజూరు విషయంలోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి పత్రికారంగంతో ఎంతో అనుబంధం ఉందని పాత్రికేయులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేయటానికి తాను సిద్ధంగా ఉంటానని అన్నారు. ఒంగోలుశాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలులో జర్నలిస్ట్ కాలనీ నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందజేస్తానన్నారు. అదేవిధంగా తమ తాతగారైన మాజీ మంత్రి దివంగత దామచర్ల ఆంజనేయులు పేరిట తన స్వంత నిధులతో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేస్తానని, అందులో ఇతర ప్రాంతాల జర్నలిస్టులు వచ్చినప్పుడు విశ్రాంతి గదులను సైతం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ప్రెసిడెంట్ కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల వేతన సవరణ చట్టం కార్యరూపం దాల్చలేదని, వేతన సవరణ జరిగి సుమారు 15 సంవత్సరాలు అవుతుందని దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిందని రాబోయే సంవత్సర కాలంలోనైనా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. మంత్రుల కమిటీ సిఫారసుల మేరకు పాత్రికేయుల అక్రిడిషన్ కార్డుల జారీ కోసం జీ.వో రూపొందినప్పటికీ అది ఇంతవరకు రాష్ట్ర కేబినెట్ ఆమోదానికి నోచుకోలేదని వచ్చే కేబినెట్ సమావేశంలో ఆ జీ.వోను ఆమోదించేవిధంగా కృ షిచేయాలని సభాధ్యక్షులు, ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బి.ఎన్. విజయ్కుమార్, డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి, ఏలూరి సాంబశివ రావు, ముత్తుముల అశోక్ రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, దర్శి తెదేపా ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఐజేయు జనరల్ సెక్రటరీ బల్వీందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్.సిన్హా, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయుడబ్ల్యుజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ లు మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.సురేష్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

**ఎన్.వి.రమణ, దాసరి కనకయ్య, ఏపీయూడబ్ల్యుజే నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్, పెన్ పవర్ బ్యూరో**

నవులూరి సుధీర్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకట్రావు, సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏ.వి. రమణా రెడ్డి, పలువురు యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు, పెద్దసంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, పాత్రికేయులు ఆలపించిన సినీగీతాలు, పద్యాలు విశేషంగా అలరించాయి. మహాసభ ప్రారంభానికి ముందు స్థానిక ప్రకాశం భవన్ దగ్గర నుంచి విష్ణుప్రియ కన్వెన్షన్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాత్రికేయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పలు సి సి రోడ్లను తనిఖీ చేసిన మున్సిపాలిటీ కమీషనర్ రమణ బాబు





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 25**

మున్సిపల్ కమిషనర్ ఈ వి. రమణ బాబు బుధవారం నాడు పట్టణంలో ని క్లబ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కాల్వర్టును పరిశీలించారు. గతంలో నిర్మాణం చేసిన ఈ కల్వర్టు కుంగి వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారటం తో ఈ కల్వర్టు నిర్మాణం చేస్తున్నారు. కాకుండా పట్టణంలో ని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణం చేసిన సి సి రోడ్డు, కనకదుర్గమ్మ వీధిలో నల్లబండ బజార్ రోడ్లను కమీషనర్ రమణ బాబు , ఏ ఈ , డి ఈ లతోకలిసి పరిశీలించారు. రోడ్ల నాణ్యత పై ఆయన ఆరా తీశారు.సి సి రోడ్ల నిర్మాణంలో నాణ్యత ను పాటించాలని కమీషనర్ రమణ బాబు ఆదేశించారు .

## మర్రిపూడిలో యువకుడి హత్య కేసు ముద్దాయిల అరెస్టు



**పొదిలి, పెన్ పవర్, జూన్ 25**

మండల కేంద్రమైన మర్రిపూడి గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో ఈ నెల 18వ తేదీన జరిగిన ఒక యువకుడి హత్య కేసులో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు కనిగిరి డివైఎస్పి యశ్వంత్ చెప్పారు బుధవారం నాడు ఆయన మర్రిపూడి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు మర్రిపూడి మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న కొల్లా రాజశేఖర్ అనే యువకుడిని హత్య చేసిన సంఘటనలో నిందితులైన జగన్నాథం రాజశేఖర్, పల్లా అనూష లను బుధవారం నాడు మర్రిపూడి పోలీసులు అరెస్టు చేసినట్లు డివైఎస్పి యశ్వంత్ చెప్పారు నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు సమావేశంలో పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్, మర్రిపూడి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపూడి విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపిక

### మండల విద్యాశాఖ అధికారి రంగయ్య వెల్లడి





**పొదిలి, పెన్ పవర్, జూన్ 25**

మర్రిపూడి మండలం లో చదువుకున్న విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారి రంగయ్య చెప్పారు మండలంలోని కాకర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉలవపాటి నిహారిక, చల్లపల్లి తులసి, మూలే ప్రత్యూష, సాయి సాత్విక్, బాల మనోహర్ రెడ్డి అదే విధంగా మండల కేంద్రమైన మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన గురజాల పల్లవి, గురజాల దీపిక లు ట్రిబుల్ ఐటీ కి ఎంపిక కావడం జరిగిందని ఎంఈఓ రంగయ్య చెప్పారు ఆయా విద్యార్థులు నూజివీడు, ఇడుపుల పాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్ లకు వెళ్లనున్నట్లు ఎం ఇ ఓ రంగయ్య తెలిపారు.

# ప్రమోషన్ ఆఫ్ ఆల్టర్నేటివ్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ యోజన







### రసాయనఎరువులపై మొత్తం వ్యయాన్ని తగ్గించడం ఈ పథకం లక్ష్యం

### మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి

### పొలం పిలుస్తోంది కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

### ముండ్లపాడు సర్పంచ్ కడియం

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 25**

గిద్దలూరు మండలం లో ముండ్లపాడు , బురుజుపల్లి గ్రామాల్లో లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాని బుధవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముండ్లపాడు ఉపసర్పంచ్ కడియం శేషగిరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేస్తోందని ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖలైన ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ , పశుసంవర్ధక శాఖ మండల స్థాయి అధికారులు గ్రామస్థాయికి విచ్చేసి వారి వారి శాఖలలో రైతుకు లబ్ధి చేకూర్చే పథకాల గురించి వివరించడం జరుగుతుందన్నారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని వారి సలహాలను సూచనలను పాటించి వ్యవసాయంలో ఇంకా ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రధానమంత్రి-ప్రణామం" ప్రమోషన్ ఆఫ్ ఆల్టర్నేటివ్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ యోజన)గురించి వివరిస్తూ సాధారణంగా వ్యవసాయం , ముఖ్యంగా పంటల ఉత్పాదకతను పెంచడానికి, అవి సరిగ్గా పెరగడానికి తగిన పోషకాలతో వాటిని అందించడం అవసరం. కానీ, కొంతకాలంగా, ఎరువులపై సబ్సిడీలు, రైతులలో అవగాహన లేకపోవడం వల్ల, ఎరువులను అధికంగా ఉపయోగించడం వల్ల నేల కోత, లవణీయత పెరగడం , మొత్తం ఉత్పాదకత తగ్గడం జరుగుతుందన్నారు. సరైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా రాష్ట్రాలను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల మొత్తం వినియోగాన్ని తగ్గించడానికి రైతులను ప్రోత్సహించడం ఈ పథకం యొక్క ప్రాథమిక లక్ష్యం అన్నారు ఈ పథకం రసాయన ఎరువులపై మొత్తం వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఇది 2024-25 లో రూ. 2.50 లక్షల కోట్లకు ఉన్నదని, ప్రతి సంవత్సరం ఎరువుల మీద ప్రభుత్వం చాలా ఎక్కువగా ఖర్చు చేస్తున్నది తద్వారా ఇది దేశ బడ్జెట్ పై ఎక్కువ భారం పడుతుందని, రానున్న రోజుల్లో రసాయనక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, ద్రవరూప ఎరువులు (లిక్విడ్ యూరియ, డి. ఎ. పి ) వైపై మరలాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షల వలన కలిగే ఉపయోగాలు, పచ్చి రొట్టె పైరులు, వాటి ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి డి.సాయి శ్వేత మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయలు , పూలు కి ప్రభుత్వం ద్వారా ఎక్కువ సబ్సిడీలు ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసి కొని ఆర్థికంగా పురోగతి చెందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులకు కౌలు కార్డులు అందించి కౌలు కార్డు ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే ఉపయోగాలను సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి వెంకటరామయ్య,గ్రామ వ్యవసాయ , ఉద్యాన సహాయకులు రవి చంద్రుడు, కిరణ్మయి, వెటర్నరీ అసిస్టెంట్ రంగనాయకులు, సౌజన్య , రైతులు పాల్గొన్నారు.

# పొలం కౌలు తీసుకున్న రైతులు విధిగా కౌలుకార్డులు పొందాలి

### బేస్తవారిపేట వ్యవసాయ అధికారి అబ్దుల్ రఫీక్



**బెస్తవారిపేట, పెన్ పవర్ జూన్ 25**

బేస్తవారిపేట మండలంలోని సలకల వీడు మరియు కలగోట్ల గ్రామాలలో బుధవారం బేస్తవారిపేట వ్యవసాయ అధికారి అబ్దుల్ రఫీ ఆధ్వర్యంలోపొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ కౌలుకు పొలం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని తెలియజేసినారు. కౌలు కార్డులు తీసుకున్న రైతులకు భవిష్యత్తులో ఈ పంట నమోదు అనుకోని పరిస్థితుల వలన పంట నష్టం జరిగితే పంట నష్ట పరిహారం కౌలుకు పొలం సాగు చేస్తున్న కౌలుదారులకు చెందుతుందని తెలియజేసినారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రకాశం జిల్లా కు మినుము, కంది, సజ్జ, వరి, ఎండుమిరప,మరియు నువ్వు పంటలు ఎంపిక చేయడం జరిగిందని తెలియజేసినారు. కావున ఈ పంటలు వేసిన ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నందు మీసేవ సెంటర్ల నందు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ప్రకృతి వైపరీత్యాల వలన వంట నష్టం సంభవించిన పంట భీమా నష్టపరిహారం అందజేయబడుతుందని అబ్దుల్ రఫీక్ తెలిపారుతెలియజేసినారు.ఈ కార్యక్రమం మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్ ఆది గణేష్ ,రైతు సేవ కేంద్రం సిబ్బంది, వి ఏఏ టీ రమణారెడ్డి ,సలకలవీడు, కలగొట్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 25**

గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి బుధవారం మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను పూల బొకేతో సన్మానించారు. తర్వాత గిద్దలూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకొంటూ కొద్ది సేపు ప్రవీణ్ కుమార్ రెడ్డి తో జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు.

## జులై 9 న మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సమ్మె

*లేబర్ కోడ్స్ రద్దు చేయాలని,మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని గిద్దలూరు ఎంఈఓ కార్యాలయంలో సమ్మె నోటీసును డేటా ఎంట్రీ ఆఫీసర్ భాస్కర్ కు సమర్పణ*



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 25**

మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం నాయకులు ఏ కుమారి ఎన్ లక్ష్మీదేవి టీ నర్సమ్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జులై 9వ తేదీన జరుగు జాతీయ సమ్మెలో గిద్దలూరు మండలం లోని వివిధ ప్రభుత్వ ఉన్నత , ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని , పని భద్రత కల్పించాలని ,మెనూ చార్జీలను ఒక పిల్లవాడికి 20 రూపాయలు ఇవ్వాలని, స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని ,ప్రమాదం భీమా కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదం జరిగి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు 20 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ ఇతర ఏ స్వచ్ఛంద సేవ సంస్థలకు అప్పగించరాదని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని ,12 నెలలకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని ,మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పైన రాజకీయ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకులు రంగమ్మ సిఐటియు నాయకులు టి ఆవులయ్య తదితరులు పాల్గొని సమ్మె నోటీసు ను సమర్పించారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి



**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 25**

పుల్లల చెరువు మండలం శతకోడు గ్రామానికి చెందిన కర్ల ప్రవీణ్ గుంటూరు జిల్లా తాడికొండ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతి పాసై ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కె ప్రవీణ్ 572మార్కులతో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు తెలిపారు. కష్టపడి, ఇష్టపడి చదివితే ఫలితం ఉంటుందన్నారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు కూడా బాగా చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థి నీ పాఠశాల సిబ్బంది,గ్రామస్తులు అభినందించారు.

# రహదారి భద్రతా నియమాలు పాటించాలి

## - ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల







**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 25**

ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఉప రవాణా కమిషనర్ ఆర్. సుశీల అన్నారు. బుధవారం స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయం నందు స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపరవాణ కమిషనర్ మాట్లాడుతూ స్కూల్ బస్సు డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడిగపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని సూచించారు. వాహనాలు పూర్తిస్థాయిలో ఫిట్నెస్ కలిగి ఉండాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్కూల్ బస్సు డ్రైవర్లు 150మంది పాల్గొన్నారు. డ్రైవర్లకు బీపీ, షుగరు, ఊపిరితిత్తులు,కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కే.రామచంద్రరావు, ఎల్. సురేంద్ర ప్రసాద్, జి. భాస్కరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

### 11 దాటిన అందుబాటులో లేని సిబ్బంది



**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 25**

మండలంలోని చింతగుంట గ్రామ సచివాలయంలో సిబ్బంది సమయపాలనను పాటించకపోవడం గ్రామస్థుల ఆగ్రహానికి దారి తీస్తోంది.మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఒక్క సోషల్ వెల్ఫేర్ మాత్రమే కార్యాలయంలో హాజరుగా ఉండడం మిగతా విభాగాల సిబ్బంది కనిపించకపోవడం స్థానిక ప్రజలను తీవ్రంగా నిరాశపరిచింది.పలు రకాల సేవల కోసం వచ్చిన ప్రజలు తమ అవసరాలు తీరక మళ్లీ వెనుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.వృద్ధులు,మహిళలు,విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రజలకు సేవ చేయాల్సిన సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపడమేకాకుండా కార్యాలయాలకు హాజరవడంలో విఫలమవుతుండటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.ప్రజల సేవ కోసం ఏర్పడిన సచివాలయ వ్యవస్థ ఇలా నిర్లక్ష్యంగా పనిచేస్తే మాకు సమస్యలు ఎక్కడ పరిష్కారమవుతాయని అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.ఇలాంటి పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల అలసత్వం చూపుతున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## 26న ఇడమకల్లు, పుల్లారెడ్డిపల్లి పంచాయతీలలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**కొత్త విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయుటకు వీలుగా సరఫరా నిలిపివేత. కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 25**

కొమరోలు మండలంలోని ఇడమకల్లు ,పుల్లారెడ్డి పల్లె గ్రామపంచాయతీలలోని గ్రామాలకు ఈనెల 26వ తేదీ గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకంలో కొత్త లైన్ల ఏర్పాటు కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అందులో భాగంగా ఈనెల 26వ తేదీ గురువారం మండలంలోని ఇడమకల్లు, పుల్లారెడ్డిపల్లి గ్రామపంచాయతీలలో కొత్త లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. అందువల్ల పుల్లారెడ్డి పల్లె ,ఎర్రం శెట్టి వాని పల్లె ,ఎడమ కళ్ళు, నరసింహుని పల్లె ,లింగారెడ్డి పల్లె, బాలిరెడ్డి పల్లె ,కిష్టం పల్లె గ్రామాలకు ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు కోరారు.

## హత్యకేసు విచారణ వేగవంతం

### - ఆళ్ల సాంబశివరావు ఇంటిలో పోలీసుల సోదాలు






**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు విచారణ వేగవంతంగా సాగుతోంది. ఈ కేసు విచారణ అధికారి ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు , నాగులుప్పల పాడు ఎస్సై రజియా సుల్తాన, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ కుమార్, వారి సిబ్బంది కలసి అమ్మనబ్రోలులోని ఆళ్ల సాంబశివరావు ఇంటిలో బుధవారం సోదాలు నిర్వహించారు. సాంబశివరావు ఇంట్లో ముద్దాయిలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు, కీలకమైన పత్రాలు, ఖాతాల పత్రాలు, బ్యాంక్ స్టేట్మెంట్లు, రికార్డింగ్స్ వంటి పలు అంశాలను అధికారులు పరిశీలించారు. ఇంకా కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు, నిందితుల సంబంధాలు వెలుగులోకి తీసుకురావడంపై పోలీసులు దృష్టి సారించారు. ముప్పా సురేష్ ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలి

### - సి సి ఎల్ ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి






**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం ఉదయం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, వర్చువల్ గా అన్నీ జిల్లాల కలెక్టర్ల తో సమావేశమై పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తుల పెండేన్సి, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపు, రీ సర్వే పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాల్లో ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్దిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటిపట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నివేశన స్థలాల కేటాయింపునకు సంబంధించి అందుబాటులో ఉన్న స్థలాల వివరాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ల్లో జరుగుచున్న రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లో రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వర కుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, ల్యాండ్ సెక్షన్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

### మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జూన్ 25**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు బుధవారం నాడు మండలంలోని జువ్వలేరు మరియు బుచ్చన్న పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు అలాగే రైతులు సాగు చేసిన పంటలను చీడపీడల నుండి కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు అలాగే పంటల బీమా పథకం కింద ప్రభుత్వం వరి, కంది, సజ్జ, నువ్వులు, మినుములు, పత్తి, ఎండుమిరప పంటలను అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు ఆయా పంటలకు భీమా చెల్లించేందుకు జూలై 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించినట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం లో భాగంగా ఖరీఫ్ సీజన్ పంటలకు అవసరమైన భీమాను నమోదు చేయించుకునే రైతులు వాటికి సంబంధించిన పత్రాలను సేవా కేంద్రాల ద్వారా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి సూచించారు మండల ఉద్యానవన అధికారి బి ధనలక్ష్మి మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో అమలు జరుగుతున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు అలాగే పండ్ల తోటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వివరాలను కూడా ఆమె రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖల సహాయకులు షేక్ మౌలాలి, నాగూర్ బి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందేలా కృషి చేస్తా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 25**

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం రానటువంటి అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా వారికి నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నష్టపరిహారం రానటువంటివివిధ గ్రామాలకు చెందినటువంటి రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు తమకు నష్టపరిహారం ఇవ్వకుండానే తమ పొలాల్లో రోడ్డు వేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు రికార్డులు సక్రమంగా ఉండి నష్టపరిహారం రాని రైతులందరికీ కూడా వారి రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు ముఖ్యంగా ముండ్లపాడు పరిధిలో కొంతమంది రైతులు తమ పేరు మీద పట్టా ఉన్నప్పటికీ ఆన్లైన్లో తమ పేరు తొలగించారని దీనివల్ల బ్యాంకు నందు లోన్లు రెన్యువల్ చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉందని అలాగే రైతు భరోసా డబ్బులు కూడా తమకు రావడంలేదని తెలిపారు వీటన్నింటినీ పరిశీలించి తగు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు రికార్డులు సక్రమంగా లేకుండా పేర్లు లేనటువంటి రైతులకు త్వరలో ఏర్పాటు చేయబోయే అసైన్మెంట్ కమిటీలో పేర్లను చేర్చి మీ భూములు మీకే ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు ఎవరూ కూడా నష్టపరిహారం రాలేదని రోడ్డు నిర్మాణ పనులను ఆపవద్దని అర్హులందరికీ నష్టపరిహారం వచ్చే విధంగా తాను కృషి చేస్తానని రైతులకు సూచించారు అనంతరం గ్రామాల వారీగా వచ్చిన రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి తహసిల్దార్ హుస్సేన్ మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు సిఎస్పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి క్లస్టర్ ఇంచార్జి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు దాసరి మల్లికార్జున చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, లక్ష్మీదేవి రైతులు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 25**

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిగారిని విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబు రావు కలిశారు. తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర పార్టీ విస్తృతస్థాయి సమావేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. టీడీపీ కూటమి ఏడాది పాలన వైఫల్యాలతో పాటు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన వైనం ప్రతిపక్ష వైయస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా సాగుతున్న కుట్రలు, దాడులపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు ఎగ్గొట్టిన తీరును ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండ గట్టాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

## ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయధికారి పి. మధుబాబు



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ జూన్ 25**

ఖరీఫ్ 2025 ప్రకాశం జిల్లాలో ఫసల్ భీమా యోజన పథకానికి నోటిఫేఢ్ సంబంధించిన పంటలయిన వరి, కంది, సజ్జ,ఎండు మిరప, నువ్వులు,ప్రత్తి పంటలు లు వేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. చంద్రశేఖరపురం మండలంలోని చింతలపాలెం మరియు కొండబోయిన పల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ 2025 లో ప్రకాశం జిల్లాలో నోటిఫ్డి పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండు మిరప, నువ్వులు పత్తి పంటలు ఎంపిక చేశారని,వరి పంటకి ఎకరాకి 860/- ,కంది పంటకి 430/- సజ్జ పంటకి 156/-ఎండు మిరప 4500/- నువ్వులు 180/- ప్రత్తి పంటకి 2100/- రూపాయలు ఎకరానికి చెల్లించాలని తెలిపారు,ప్రీమియం చెల్లిం చవలసిన రైతులు రైతు సేవా కేంద్రం లోని వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకుల వద్ద పంట సాగు పత్రం తీసుకోని దానితో పాటుగా ఆధార్ కార్డు,పట్టాదారు పాసు పుస్తకం,బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నెంబర్ తీసుకొని సిఎస్ సి సెంటర్ కి వెళ్లి ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు రసాయన ఎరువులు వాడకాని తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించలని భూసారా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించాలని, కౌలు రైతు కార్డుల వలన ప్రయోజనాల గురించి,పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేయడం వలన ఉపయోగాలను గురించి రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.శ్రీనివాసులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.వెంకటరెడ్డి,వి. శ్రీకాంత్ మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు.

# ఆటో ప్రమాదం, ఇరువురికి స్వల్పగాయాలు



**గుడ్లూరు పెన్ పవర్ జూన్ 25**

మండలం పరిధిలోని పోట్లూరు మరియు తెట్టు ప్రధాన రహదారిపై గల దున్నపోతు వాగు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలు అయిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తెలిసిన వివరాలు ప్రకారం పొట్లూరు, తెట్టు రహదారిలో ప్రయాణిస్తున్న ఆటో దున్నపోతువాగు వద్దకు వచ్చేసరికి ఆటో ముందు టైరు ఒక్కసారిగా పంక్చర్ కావడంత, ఆటో అదుపుతప్పి రోడ్డుప్రక్కన గల మైలురాయిని బలంగా ఢీకొన్నది. దీనితో ఆటోలో ఉన్న ప్రయాణికులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ఆటోలో ఉన్న వారికి పెద్దగా ప్రమాదం జరగకపోవడం సంతోషకరం. కానీ ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం కావలి హాస్పిటల్ కు తరలించారు.

# నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తత అవసరం



**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 25**

రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి ప్రకాష్ రావు స్పష్టం చేశారు.మండలంలోని పెదారికట్ల,చిన్నారికట్ల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రకాష్ రావు మాట్లాడుతూ అధికారికంగా లైసెన్సులు ఉన్న విత్తన డీలర్ల నుంచే విత్తనాలు కొనాలని ప్రతి కొనుగోలుపై రశీదు తీసుకోవడం తప్పనిసరని సూచించారు.ప్రభుత్వ పథకాల రాబడిని పొందాలంటే కౌలు కార్డు తప్పనిసరి అని రైతులకు ఇచ్చే ప్రతి రాయితీ పథకం కౌలు కార్డున్న వారికే వర్తిస్తుందని అన్నారు.కాబట్టి ప్రతీ కౌలురైతు వెంటనే కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి తెలియచేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరాములురెడ్డి, అరవింద్, ఏఈఓ రవికాంత్ రైతులు పాల్గొన్నారు.

# ఉనికి కోసం జగన్ పరామర్శల యాత్ర

**- 2026 నాటికి వెలుగొండను పూర్తి చేస్తాం**

**- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 25**

పరామర్శల పేరుతో జగన్ తన కార్యకర్తలను చంపుతూ రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్లో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ జగన్ పర్యటనల కారణంగా రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కరువైందన్నారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో పొదిలి పట్టణంలో అమరావతి మహిళలను అవమానపరిచిన ఘటనను పురస్కరించుకొని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెలుగు మహిళా నాయకుల పై, పోలీసులపై, ప్రజలపై వైసీపీ శ్రేణులు దాడులకు దిగారని అన్నారు. అలాగే పల్నాడులో జగన్ మాటలు నమ్మి బెట్టింగులకు పాల్పడి, అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని ఏడాది తర్వాత పరామర్శించేందుకు జగన్ వెళ్ళాడన్నారు. అయితే భద్రత దృష్ట్యా పోలీసులు కేవలం 3 వాహనాలకు అనుమతి ఇచ్చి 100 మందితో పరామర్శ కార్యక్రమం చేపట్టాలని సూచించిన జగన్ తన బల ప్రదర్శనను కొనసాగించారన్నారు. పరామర్శకు వచ్చే నాయకుడికి గజ మాలలు, డీజే బాక్సు భారీ ర్యాలీలతో పనేందన్నారు. జగన్ ఉద్దేశపూర్వకంగానే భారీ ర్యాలీ నిర్వహించారని అన్నారు. జగన్ కాన్వాయ్ ఆ పార్టీకి చెందిన వ్యక్తిని గుద్దినా పట్టించుకోకుండా పక్కకి చెట్ల గుట్టలోకి లాగి పడేశారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చావు బతుకుల మధ్య ఉన్న వ్యక్తులను పరామర్శించకుండ పోవడం పై మంత్రి మండిపడ్డారు. జగన్ కు సొంత కార్యకర్తలు అన్నా కనీస గౌరవం లేదన్నారు. గాయపడిన కార్యకర్తను పక్కకు లాగేసి తన బల ప్రదర్శన కొనసాగించారని అన్నారు. కనీసం 108 కూడా ఫోన్ చేయలేదని,హాస్పిటల్ కి తరలించేందుకు ఎవరిని పురమాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి జగన్ తన పర్యటనలను కొనసాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కార్యకర్తలు జగన్ తీరు పట్ల జాగ్రత్త వహించాలని హితవు పలికారు. 2026 నాటికి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యి ఉంటే, మరో 20 సంవత్సరాలు అయినా వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కోసం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. చాలా పనులు పూర్తిగా కాకుండానే మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయటం ఏంటని ఎద్దేవా చేశారు. పూర్తి చేసేది తెలుగుదేశం ప్రభుత్వమే అని పేర్కొన్నారు. సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, దర్శి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ లక్ష్మి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

## - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా







**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

మాదకద్రవ్య రహిత సమాజాన్ని సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఈ దిశగా విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ అంతర్జాతీయ మాదకద్రవ్య రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టే కార్యక్రమ నిర్వహణపై జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ , ఏ.ఎస్.పి. నాగేశ్వరరావులతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గురువారం గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు. దీనికి అనుబంధంగా అన్ని జిల్లాలలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున జిల్లా కేంద్రమైన ఒంగోలులో బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం అక్కడి నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు ప్రత్యేక ర్యాలీ ఉంటుందని ఈ సందర్భంగా వారు వివరించారు. విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశా వర్కర్లు, ఇతర ఉద్యోగులు, అంగన్వాడి సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలను ఈ ర్యాలీలో భాగస్వాములను చేయాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ దిశగా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ర్యాలీలో పాల్గొనే వారికి అవసరమైన ముందస్తు వైద్య సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నందున చేయాల్సిన ఏర్పాట్లపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మధ్యాహ్నం నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, నగరంలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పదార్థాలను వివరించేలా రూపొందించిన పోస్టర్లను, నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు. ఈ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి పేరు, ఇతర వివరాలను నమోదు చేస్తే డ్రగ్స్ వినియోగ వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది.

ఈ సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఐసిడిఎస్ పిడి సువర్ణ, మెప్మా పీడీ శ్రీహరి, డిఆర్డిఏ పిడి నారాయణ, ఎక్సైజ్ ఎస్.ఈ. ఆయేషా బేగం, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డిటిసి సుశీల, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి, డీఈవో కిరణ్ కుమార్, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిసిపిఓ దినేష్ కుమార్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, మహిళా పిఎస్ డిఎస్పి రమణ కుమార్, ఏ.ఆర్. డిఎస్పి కే.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యం

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా ఈ సంవత్సరం 15శాతం వృద్ధి రేటు లక్ష్యంతో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల పురోగతిపై, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మరియు దాని అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిరేటే లక్ష్యం సాధించేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకొని అందుకనుగుణంగా లక్ష్య సాధనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతుకు ఖర్చు తగ్గించి, ఉత్పత్తి పెంచేలా తదనుగుణంగా అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రైతుల్లో కూడా ఈ విషయాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో భూసార పరీక్షల్లో భాగంగా 34,293 మట్టి శాంపిల్స్ లక్ష్యంగా కాగా వంద శాతం సాధించడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జిల్లా కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో పొలం బడి కార్యక్రమం పటిష్టంగా అమలు జరగాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా లో 46,015 మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు మంజూరు లక్ష్యం కాగ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యం మేరకు కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ వినియోగం ముందు డ్రోన్ వినియోగం తరువాత ఎంత పంట దిగుబడి వచ్చిందో వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నివేదికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన విత్తనాలు, ఎరువులు డిమాండ్ మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, గ్రామస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సేంద్రియ ఉత్పత్తులను పెంచడమే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి కి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా ప్రణాళికలు రూపొందించి అందుకనుగుణంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశుగ్రాసం పంపిణీ, పశు భీమా లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా లో 1259 గోకులం షెడ్స్ మంజూరు చేయడం జరిగిందని, అందులో 822 పూర్తీ కావడం జరిగిందని, మిగిలినవి త్వరగా పూర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి కి చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబం రిజిస్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారి సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, పశుసంవర్ధక శాఖ జెడి రవి కుమార్, మత్స్య శాఖ జెడి శ్రీనివాస రావు, ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం సుభాషిని, మార్క్ఫెడ్ అధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శకులను త్వరగా గుర్తించాలి

**- అధికారులకు జిల్లా కలెక్టర్ సూచన**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం (పి-4) పథకంలో భాగంగా పేదలకు సహాయం చేసేందుకు అవసరమైన ' మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపై బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాల కింద జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు వీటికి అవసరమైన సహాయం చేసేలా మార్గదర్శకులను గుర్తించేందుకు ఆగస్టు 15వ తేదీ డెడ్ లైన్ కాబట్టి త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో బంగారు కుటుంబాలుగా పేర్కొన్న వాటిలో పొందగోరే సహాయాన్ని నిర్దిష్టంగా గుర్తించాలని ఆమె చెప్పారు. ఆ మేరకు మార్గదర్శకులను వాటితో అనుసంధానం చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జిల్లా స్థాయితో పాటు మండల స్థాయి అధికారులను కూడా మార్గదర్శకులుగా కొన్ని కుటుంబాలకు అనుసంధానం చేసి ఆయా కుటుంబాలు పేదరికం నుంచి బయటపడేలా సంబంధిత హోదాలోని అధికారులు నిరంతరం పర్యవేక్షించేలా తాను ఆదేశాలు జారీ చేస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, బంగారు బాల్యం కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి గిరిధర్ శర్మ, ఇంచార్జ్ సిపిఓ స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వీరేపల్లి మోడల్ స్కూల్ నుండి త్రిబుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపిక.

**ఉలవపాడు, పెన్ పవర్, జూన్ 25:**

మండలంలోని వీరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ నుండి ఇద్దరు విద్యార్థులు త్రిబుల్ ఐటీ కి ఎంపిక కావడంపై పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తాటితోటి ప్రభాకర్ రావు, పాఠశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు లు ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోనికి వెళితే ఈ మధ్య జరిగిన త్రిబుల్ ఐటీ అర్హత పరీక్షల్లో వీరేపల్లి ఏపీ మోడల్ స్కూల్ నుండి విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, చిరుతోటి ధనలక్ష్మి నూజివీడుకు క్యాంపస్ కు, పీ.మేఘనారెడ్డి ఇడుపులపాయ క్యాంపస్ కు ఎంపికయ్యారు. వీరేపల్లి మోడల్ స్కూల్ నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంపై విద్యా కమిటీ చైర్మన్ ప్రభాకర్ రావు ఇద్దరు విద్యార్థులకు మరియు పాఠశాల అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యా బోధనలో అధ్యాపకుల కృషిని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇదేవిధంగా మునుముందు కూడా ఉత్తమ విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని విద్యా కమిటీ చైర్మన్ తాటితోటి ప్రభాకర్ రావు అన్నారు. త్రిబుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది తోపాటు గ్రామ నాయకులు కూడా తమ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.





# రామాయపట్నం పోర్టు పరిధిలో పారిశ్రామిక అభివృద్ధికి అందరూ సహకరించాలి

భూములు ఇచ్చే ప్రతి రైతుకు న్యాయం చేస్తాం.
ఉద్యోగాలలో స్థానికులకే ప్రాధాన్యం.
రైతుల సమస్యలనీ పరిష్కరిస్తాం.
ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు.














**గుడ్లూరు, పెన్ పవర్, జూన్ 25:**
రామాయపట్నం పోర్టు పరిధిలో పారిశ్రామిక అభివృద్ధి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక గ్రామాల వారిని అభ్యర్థించారు. మండలంలోని రావూరు గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామసభ జరుగగా జిల్లా కలెక్టర్ ఆనంద్ తో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మరియు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి కోసం భూములు ఇచ్చే ప్రతి రైతుకు న్యాయం చేస్తామని, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తర్వాత స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు. రాష్ట్ర చరిత్రలోనే భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే పరిహారాన్ని పెంచి రైతులకు న్యాయం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ముందుగా గ్రామ రైతుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినట్లైతే ఆ సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం తీసుకోకుండా, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు ఎమ్మెల్యే భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ భూములు ఇచ్చే రైతులందరూ న్యాయం చేస్తామని, రైతులకు ఇచ్చే నష్టపరిహారం విషయంలో స్థానిక శాసనసభ్యులు నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రైతులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేశారని తెలిపారు. స్థానికంగా ఇండోసోల్ మరియు బిపిసిఎల్ పరిశ్రమల్లో ముందుగా స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా తప్పనిసరిగా కృషి చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయా గ్రామాల రైతులు తమ సమస్యలను సభ ముందు అధికారులకు స్థానిక ఎమ్మెల్యే కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ మరియు స్థానిక ఇంచార్జ్ తహశీల్దార్ విజయ్ భాస్కర్ ఇతర అధికారులు మరియు పోర్టు పరిధిలో గల గ్రామాల సర్పంచులు , రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ఐటి మినిస్టర్ను మర్యాద పూర్వకముగా కలిసిన జిల్లా ఎస్పీ





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, జూన్,25**
రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఐటి మినిస్టర్ నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఐపిఎస్. కృష్ణ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారికి, రాష్ట్ర మరియు ఐటి మినిస్టర్ నారా లోకేష్ కి జిల్లా ఎస్పీ శ్రీ ఆర్.గంగాధరరావు, ఐపిఎస్., మొక్కలు అందజేసి సాదర స్వాగతం పలికారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణి చేసిన, ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**పెన్ పవర్, గుంటూరు, జూన్. 25.**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గమునకు చెందిన పలువురు పేదలు పలు ఆసుపత్రులలో వివిధ రకాల చికిత్సలు పొందిన వారికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి సిఫారసుతో 32 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన రూ. 27,62,094/- లక్షల చెక్కులను లబ్దిదారులకు బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నదని, ఇంటి పెద్ద కొడుకుగా చరిత్రలో నిలిచిపోతారని,ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం, పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా తమను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.

## నాగాయలంక తాసిల్దార్కి కోడూరు తాసిల్దార్గా అదనపు బాధ్యతలు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్, 25**
కోడూరు మండల తాసిల్దార్ (ఎఫ్ఎసి) గా నాగాయలంక తాసిల్దార్ గా పనిచేస్తున్న సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ బుధవారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ తాసిల్దార్ సౌజన్య కిరణ్మయ్య , సీనియర్ అసిస్టెంట్ సరళ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుభాషిణి, తో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## కృష్ణ యూనివర్సిటీలో క్యాంటీన్ ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రి నారా లోకేష్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, జూన్,25:**
మచిలీపట్నం కృష్ణ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన ఆహారశాలను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాష్ట్రమంత్రి నారా లోకేష్ కొల్లు రవీంద్రాలు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కృష్ణ యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణి

**– ఎమ్మార్వో అనిల్ కుమార్**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్, 25**
ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా;వృద్ధులకు వికలాంగులకు 5 రోజుల ముందుగానే రేషన్ ఇంటి వద్దనే అందించాలని పెదన మండల తహసీల్దార్ కూనపురెడ్డి అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఈనెల 26వ తేదీ గురువారం నుండి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నెల 1 తేదీ నుండి రేషన్ ఇస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 రోజులు ముందుగా వృద్ధులకు,వికలాంగులకు వారి ఇళ్లకు వెళ్లి రేషన్ అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ ఐ. ఈడే విజయలక్ష్మి, విఆర్ఓ కృపావరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు 16 నూతన ద్విచక్ర వాహనాలు

**జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**









**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 25**
ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 16 నూతన ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ఆఫీసు, మంగళగిరి నుండి వచ్చిన వాటిలో టీవీఎస్ అపాచీ ఆర్ టి ఆర్ 160 సీసీ ద్విచక్ర వాహనాలు 15, రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ ఒకటి, ఈ వాహనాలకు సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, ప్రధమ చికిత్స కిట్, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు మరింత వేగవంతంగా స్పందించే అవకాశాన్ని కల్పిస్తాయని, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ, ప్రజలకు వేగవంతమైన సేవలందించడానికి ఈ ద్విచక్ర వాహనాలు ఎక్కడైనా త్వరగా చేరుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో, ప్రమాద సంఘటనల సమయంలో తక్షణ చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ జాం సమస్యలు పరిష్కరించడం వంటి అంశాల్లో ఈ వాహనాలు ఎంతోగానో ఉపయోగపడుతాయని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని, ఎక్కడైనా ఫోర్ వీలర్ వెళ్ళలేని ప్రాంతాలలో టూ వీలర్స్ వెళ్ళి అక్కడ ట్రాఫిక్ సమస్యను తగ్గించి, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో పని చేస్తాయన్నారు. నూతన ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే పోలీస్ సిబ్బందికి వారి విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, తలకు గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. కావున ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి..!

**-ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



**వెల్దుర్తి: జూన్ 25 బుధవారం (పెన్ పవర్)**
మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, చైర్మన్ మదార్ సాహెబ్, పలువురు కౌన్సిలర్లు భేటీ అయ్యారు. పట్టణ మౌళిక వసతుల కల్పనకై మున్సిపల్ అధికారులు తయారు చేసిన ప్రణాళికలను ఎమ్మెల్యేకు కమిషన్ వేణుబాబు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని ఎమ్మెల్యే ఆరా తీశారు. వీటి నిర్మాణాలకు త్వరగా టెండర్లకు పిలిచి.., పనులు ప్రారంభించాలని సూచించారు. పట్టణ శివారు ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, లైటింగ్ వంటి మౌళిక సదుపాయాలపై నివేదిక తయారు చేసి, వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధికి ఇంకా మరిన్ని గ్రాంట్ల ద్వారా నిధులు రానున్నాయని, ప్రజా సమస్యలను గుర్తించి, పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని ఆయన సూచించారు.

# ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు శుభాకాంక్షలు

- తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోష

-పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పించండి



**కందుకూరు పెన్ పవర్,జూన్ 25**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రను బుధవారం నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ లో గల క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి రెండవ సారి ఎమ్మెల్సీగా ఎన్నికైన శుభ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చే విధంగా పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పించాలని కోరగా స్పందించిన బీద పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం కష్టపడిన వారికి పదవులు ఇవ్వాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు మోషే మీడియాకు సమాచారం ఇచ్చారు. బీద రవిచంద్రను కలిసిన వారిలో కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి కసుకుర్తి నవరత్నం , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ , ఆలూరి ఆనంద్ , ఆలూరి అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

# రాయితీ జనుము విత్తనాలు పంపిణీ





**కందుకూరు పెన్ పవర్, జూన్ 25**

కొండి కందుకూరు, పలుకూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ముందుగా రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకున్న రైతులకు రాయతీ జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నార్నె రోశయ్య, ఉన్నం భాస్కర్ రావు, సర్పంచ్ శ్రీనివాసులు, రెబ్బవరపు మాల్యాద్రి, ఈదర నరసయ్య, పంచాయతీ కార్యదర్శి ఘట్టమనేని రాంబాబు, వి ఏ ఏ లు, రైతులు పాల్గొన్నారు.

# బచ్చు సందీప్ మరణం కందుకూరు ఆర్ఎస్ఎస్ శాఖకు తీరని లోటు

**డాక్టర్ తన్నీరు మల్లికార్జున**

**కందుకూరు పెన్ పవర్,జూన్ 25**

కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ, ప్రస్తుత ఖండ కార్యకారిణి బచ్చు సందీప్ మరణం కందుకూరు ఆర్ఎస్ఎస్ కు తీరని లోటు అని కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్ డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. గత కొన్ని రోజులుగా క్యాన్సర్ తో బాధపడుతూ బుధవారం ఉదయం హైదరాబాదులో మరణించారు. ఈ మరణ వార్త విని కందుకూరులో సందీప్ మిత్రులు, ఆర్యవైశ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు సందీప్ ఎన్నో సేవలు అందించాలని అన్నారు. సందీప్ నిబద్ధత గల ఆర్ఎస్ఎస్ కార్యకర్త అని అన్నారు. అలాంటి మంచి మనిషిని మృతి చెందటం తనకెంతో తీరని లోటని డాక్టర్ మల్లికార్జునరావు సంతాపం ప్రకటించారు. కందుకూరు పట్టణంలో పలువురు ఆర్యవైశ్యులు సందీప్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు.



# కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రులు













**కందుకూరు పెన్ పవర్, జూన్ 25:**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విద్యారంగానికి కంచర్ల రామయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. ఇటీవల కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ అధినేత, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య పరమపదించారు. ఈ మేరకు బుధవారం నాడు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, అశోక్ రెడ్డి, మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తదితరులు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విజయ శ్రీనివాస్ లను పరామర్శించారు. ఈ సందర్భంగా కంచర్ల రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల రామయ్య విద్యా రంగానికి అందించిన సేవలను నేతలు స్మరించుకున్నారు.ఎమ్మెల్సీ శ్రీకాంత్, కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామల్లేశ్వరరావు, గుర్రం మాల్యాద్రి, షేక్ రఫీ, పోకూరి రాంబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# స్త్రీ శిశు సంక్షేమ శాఖ పై కలెక్టర్ సమీక్ష

- పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, బాల్య వివాహాల నిరోధానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 25**

పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా వారికి సరైన పోషకాహారం అందించేలా శ్రద్ధ తీసుకోవడంతో పాటు బాల్య వివాహాల నియంత్రణ కు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, సిడిపిఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా చేపడుతున్న 0 - 6 సంవత్సరాల పిల్లల ఆధార్ ఎన్రోల్మెంట్, అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల మరమత్తులు, ఇంకుడు గుంతల నిర్మాణాల పురోగతి, బాల్య వివాహాల నియంత్రణ కు తీసుకుంటున్న చర్యలు తదితర కార్యక్రమాల అమలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భవతులకు నిర్దిష్ట సమయంలో సరైన పౌష్టికాహారం అందించి, మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు కూడా పౌష్టికాహారం అందించి, వారు ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న పనులు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. 0- 6 సంవత్సరాల పిల్లల ఆధార్ ఎన్రోల్మెంట్ వంద శాతం జరిగేలా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణ కు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సువర్ణ, డిసిపిఓ దినేష్ కుమార్, సిడిపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ మరియు వ్యవసాయ శాఖ గ్రామస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం

**పెద్ద దోర్నాల పిన్ పవర్ జూన్ 25**

జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాలు అనుసరించి పంట సాగు హక్కుదారు పత్రాలపై సిసిఆర్సి సిసిఆర్సి కార్డ్స్ మండల స్థాయిలో రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల గ్రామ స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి,అధ్యక్షత వహించి రెవెన్యూ అధికారులకు మరియు గ్రామ సహాయకులకు పలు సూచనలు ఇచ్చారు. పంట సాగుచేసే భూ యజమానులకు సమానంగా కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అందించే సబ్సిడీ ఫలాలు అనగా అన్నదాత సుఖీభవ, పంటల బీమా మరియు ఇన్పుట్ సబ్సిడీ మొదలైన పథకాలను అందించడమేనని తెలియజేసారు.ముందుగా గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకులు పెద్ద ఎత్తున రైతుల్లో సి సి ఆర్ సి కార్డులు ఇస్తున్నట్లు ప్రచారం చేయవలెను. సి సి ఆర్ సి కార్డులు పొందడానికి దిగువ తెలిపిన 4 స్టెప్స్ ను విధంగా ఫాలో అవ్వాలని తెలిపారు.

ఫారం 1...: ముందుగా కౌలు చేసే రైతులు భూ యజమాని యొక్క పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తో పాటుగా అలాగే కౌలు రైతు కూడా తన ఆధార్ కార్డు మరియు పాస్ పార్ట్ సైజ్ ఫోటోను ఫారం 1 కి జత చేసి దానితో పాటు భూ యజమానికి కౌలుదారునకు మధ్య 10 రూపాయల స్టాంప్ మీద పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నట్లు వ్రాసుకున్న అంగీకార పత్రాన్ని కూడా జతచేసి గ్రామ రెవెన్యూ అధికారి గారికి దరఖాస్తు చేసుకోవాలి.

**ఫారం 2...:** గ్రామ రెవిన్యూ అధికారులు కౌలు రైతు ఇచ్చిన ఫారం - వివరాలను పరిశీలించి ఫారంలో ఉన్న విషయాలు వాస్తవమని నిర్ధారించుకున్న తరువాత వారి లాగిన్ లో కౌలు రైతుల వివరాలు, భూ యజమాని యొక్క పొలం వివరాలను నమోదు చేసి సి సి ఆర్ సి కార్డు మంజూరు చేయటం జరుగుతుంది. మంజూరు చేసిన కార్డు పూర్తి వివరాలను గ్రామ రెవెన్యూ అధికారులు ఫారంలో నమోదు చేసుకుని కౌలు రైతుకి సి సి ఆర్ సి కార్డు సదరు కౌలు రైతుకి అందజేస్తారు.

**ఫారం 3...:** కార్డు తీసుకున్న తరువాత కార్డు వివరాలను గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు తప్పనిసరిగా గ్రామ స్థాయిలో ఫారం 3 రిజిస్టర్ నందు నమోదు చేసుకోవలెను. అలాగే కౌలు రైతులకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందించినా ఇదే రిజిస్టర్ నందు నమోదు చేసుకోవలెను.




**ఫారం 4 ఎ..:** కౌలు రైతులలో అర్హత ఉండి ఎవరైనా కార్డులు పొందని వారు ఎవరైనా ఉన్న యెడల వారి పూర్తి వివరాలతో తహసీల్దార్ గారికి దరఖాస్తు చేసుకుని నా వివరాలను పరిశీలించి నాకు సిసి ఆర్ సికార్డు మంజూరు చేయమని అప్పీల్ చేసుకోవచ్చును.

**ఫారం 4 బి..:** భూ యజమానులలో ఎవరైనా మాకు తెలియకుండా మా అనుమతి లేకుండా మా భూమి వివరాలను పలకరించి వేరే రైతులకు సి సి ఆర్ సి కార్డు మంజూరు చేసారు , అందువలన పూర్తి వివరాలు పరిశీలించి సదరు సి సి ఆర్ సికార్డును క్యాన్సిల్ చేయగలరని తహసీల్దార్ గారికి అప్పీల్ చేసుకోవచ్చును. ఈవిధంగా సిసిఆర్సి కార్డులు గురించి కౌలు రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఉద్దేశాల ప్రకారం వారికి సకాలంలో పంట రుణాలు ఇప్పించేలా చేయాలని కోరారు. జరుగుమల్లి మండలానికి 962 కార్డులు చేయాలని లక్ష్యం నిర్దేశింపబడినట్లు తెలిపారు.రైతు సోదరులు ఈ కౌలు కార్డులు పొంది సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి మండల తహసీల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి గారు మరియు మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్,గ్రామ రెవెన్యూ అధికారులు మరియు గ్రామ సహాయకులు పాల్గొన్నారు. అలాగే ఈ రోజు అయినముక్కల మరియు దోర్నాల 1 రైతు సేవా కేంద్రం లో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి రైతులకు వ్యవసాయ శాఖ లో అమలుఅవుతున్న పథకాల గురించి మరియు ప్రత్యామ్నాయ పంటలపై మరియు ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం ల ఏఈఓ చైతన్య కుమార్, ఏపీ సీఎం ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైకాపా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న తూమాటి, బుర్రా





**కందుకూరు పెన్ పవర్, జూన్ 25:**

వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి నాయకులకు రాబోయే కాలంలో చేసే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు, మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గం వైకాపా ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ,ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో, చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ పేరుతో వైయస్సార్సీపీ 5 వారాల బృహత్తర కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

# మహా కరుణ శాకాహార ర్యాలీకి ఎమ్మెల్యే కి ఆహ్వానం

**కందుకూరు, పెన్ పవర్ జూన్ 25**

జూలై 13 ఆదివారం కందుకూరు పట్టణంలో జరిగే మహా కరుణ శాఖాహార ర్యాలీకి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని కందుకూరు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ వారు బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షులు టి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ జూలై 13 ఆదివారం ఉదయం 9 గంటలకు కందుకూరు ఏఎంసీ మార్కెట్ వద్ద నుంచి టీటిడి కళ్యాణమండపం వరకు మహా కరుణ శాఖాహారి ర్యాలీ భారీ ఎత్తున జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు నాగేశ్వరరావు ని ఆహ్వానించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని శాఖాహార ర్యాలీని జయప్రదం చేయవలసిందిగా శ్రీరామచంద్రమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# తన ఉనికిని కాపాడుకునేందుకే జగన్ పర్యటనలు -వైయస్ షర్మిల










**చీరాల,పెన్ పవర్,జూన్25**

చీరాలలో వైఎస్ షర్మిల బుధవారం పర్యటించారు .ఈసందర్భంగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో స్థానిక బేపాస్ రోడ్డు నుంచి చీరాల పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ నేతలు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని ,,,వైఎస్ షర్మిల కు భారీ ర్యాలీతో ఘనా స్వాగతం పలికారు .స్థానిక ముక్కోణం పార్కు కూడలిలోని డా"బిఆర్ అంబేద్కర్ ,మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ తో పాటుగా దివంగత నేత డా"వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పూలమాలలు వేసి ఘనా నివాళుర్పించారు .అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులూ ,కార్యకర్తలతో పార్టీ బలోపితం పై సమావేశం నిర్వహించారు .ఈసందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ తన ఉనికిని కాపాడుకునేందుకే పర్యటనలు, బలప్రదర్శనలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రధాని మోదీ పాదాల వద్దకు చేరి అప్పట్లో కేంద్రం అమలు చేసిన ప్రతి బిల్లుకూ మద్దతు తెలిపారని, రాష్ట్ర సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టారని ఆరోపించారు.ఇప్పుడు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టును 45 అడుగుల ఎత్తు కట్టాల్సి ఉన్నా కేంద్రం 41 అడుగులే కడతామంటూ పార్లమెంట్‌లో తీర్మానం చేసినా ఒక్క ఎంపీ కూడా దీన్ని ప్రశ్నించలేదని నిలదీశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో బీజేపీ మోసం చేసిందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించక పోవటం సరికాదని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ అమలులోనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, యువతకు ఉద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని విస్మరించారని అన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల, వేటపాలెం జడ్పిటిసి సభ్యురాలు,కార్యకర్తలు నాయకులు ఆమంచి అభిమానులు పాల్గొన్నారు.

## గుంటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో శ్రీ కన్వెన్షన్ హాల్ వేదిక కానుంది

### ఎమ్మెల్యే నసీర్ ఎమ్మెల్యే గల్లా మాధవి




**పెన్ పవర్, గుంటూరు, జూన్. 25**

ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు, హోం మంత్రి అనిత తో కలిసి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సదుపాయాలు, మరియు కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించిన గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఎమ్మెల్యే గల్లా మాధవి.ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం తరఫున హోం మంత్రి హృదయపూర్వక స్వాగతం తెలపడం జరిగింది.గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ఆహ్వానం మేరకు గుంటూరులోని వారి నివాసానికి విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత . వారి అభిమానానికి ముగ్ధులయ్యారు.

## జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోనీ
## 26వ వార్డులో వృద్ధురాలికి చేయూత



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 25:**

చిలకలూరిపేట: పట్టణంలోని 26వ వార్డులో తిరుపతమ్మ గుడిలో సేవ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక వృద్ధురాలి కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలిచింది జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ పేరు మీద తమ సొంత నిధులతో జనసేన నాయకులు బియ్యం, నిత్యావసర వస్తువులు, మరియు ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన యువనాయకులు మండలనేని చరణ్ తేజ పేరు మీద చేపట్టిన రెండో సేవా కార్యక్రమం అని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 26వ వార్డు జనసేన నాయకులు పీఎస్ఆర్, మీసాల రాజు, మీసాల లక్ష్మణ్, ఉపేంద్ర, బొంతు రామారావు, సంతు తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జీవితానికి హాయ్ చెప్పండి

### మత్తు పదార్థాలకు నో చెప్పండి -సిడిపిఓ ఝాన్సీ పిలుపు

**వేటపాలెం, పెన్ పవర్, జూన్ 25**

పీఎం ముక్తి భారత్ పిలుపు మేరకు మండలంలోని బి బి హెచ్ జూనియర్ కాలేజీ, జడ్పీ గర్ల్స్ హై స్కూల్, దేశాయిపేట జడ్పీ హైస్కూల్లో బుధవారం మత్తు పదార్థాలు వాడకూడదని , వాటి వల్ల కలిగే అనర్థాలనుతెలియజేస్తూ వేటపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ డి ఝాన్సీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతుగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు రహిత, ఆరోగ్యవంతమైన, బలమైన భారత్ నిర్మించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జీవితానికి హాయ్ చెప్పండి -మత్తు పదార్థాలకు నో చెప్పండి అనివిద్యార్థిని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.



# ఎమర్జెన్సీ డే,సెమినార్? 'అత్యవసర పరిస్థితి, విధించిన చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు

### బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు



**పెన్ పవర్, గుంటూరు, జూన్. 25.**

టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ మాట్లాడుతూ ఏమర్జెన్సీ డే అంటే నే చీకటి రోజని మన హృదయాలకి గాయపడిన రోజు. ఒక వ్యక్తి తన అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రకటించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ చరిత్రలోనే ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం. కాంగ్రెస్ పాలనలో ఇందిరాగాంధీ 1975 జూన్ 25న ప్రకటించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య ఆత్మపై దాడి చేసిందని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించి అత్యవసర పరిస్థితిని అమలు చేసింది. పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసింది. వేలాది మంది ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేసి, మీడియాపై సెన్సార్‌షిప్ విధించింది. రాజకీయ విమర్శలను కిరాతకంగా అణచివేసింది. ఎమర్జెన్సీలాంటి కఠిన పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు నివాళులు అర్పిస్తున్నాను. జాతీయవాదం, పౌర హక్కుల విలువలపై ఆధారపడిన భారతీయ జనతా పార్టీ. ఎమర్జెన్సీ తర్వాత ప్రజల నిజమైన గొంతుగా ఎదిగింది అని అన్నారు. భారతదేశ స్వతంత్ర సమర వీరుల కలలన్ని కల్లలైపోయాయి. అనేక మంది త్యాగల ఫలితంగా సాదించుకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యం పై నీలి నీడలు కమ్ముకున్నాయి. దేశ ప్రజలు స్వతంత్ర భారతదేశంలో మరోసారి పోరాటం జరపవలసిన అవసరం ఏర్పడింది. 1971 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఇందిరాగాంధీ ఉత్తరప్రదేశ్లోని రాయభరేలి నియోజకవర్గం నుండి పార్లమెంటుకు ఎన్నికయింది. అయితే ఆఎన్నికలలో ఇందిరాగాంధీ అక్రమాలకు పాల్పడినందుకు ఆమె ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ కోర్ట్ తీర్పునిచ్చింది. ఇందిరా గాంధీ నియంతృత్వానికి కలిగిన తొలి అఘాతమిది. ఇందిరాగాంధీ అధికార వ్యామోహంతో రాజీనామా చేయడానికి అంగీకరించలేదు. ఒకసారి పదవినుంచి వైదొలిగితే మళ్ళీ అధికారం వస్తుందని నమ్మకం లేక రాజ్యాంగాన్ని ఉల్లంఘించి అత్యవసర పరిస్థితి ఏమర్జెన్సీ తీసుకువచ్చి దేశంలో సమస్యలకు మూల కారణంగా తయారయింది అని అన్నారు. ఈఎమర్జెన్సీ విషయాలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని యువతకు తెలియ జేయడమైనది. బిజెపి హెడ్ క్వార్టర్ ఇంచార్జి మకుటం శివ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానమంత్రి గా విధించిన ఎమర్జెన్సీ రోజులను చీకటి రోజులుగా అభివర్ణించారు. ఒక వ్యక్తి యొక్క నియంతృత్వ పోకడలకు అధికార దాహానికి ఎమర్జెన్సీ ఒక నిదర్శనమన్నారు. నేటి యువతరం చరిత్రని తెలుసుకొని గతంలో జరిగినటువంటి తప్పులను భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకోసం చరిత్రని తప్పనిసరిగా తెలుసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఎమర్జెన్సీ జరిగి 50 ఏళ్ళు అవుతున్నా ఆయొక్క భయంకరమైన పరిస్థితులు తలుచుకుంటే ఇప్పటికీ భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. దేశంలో రాజ్యాంగం ప్రవేశపెట్టిన 25 సంవత్సరాలలోనే రాజ్యాంగం యొక్క హత్య ఈదేశంలో ఇందిరాగాంధీ చేతుల మీదుగా జరిగిందని ఎమర్జెన్సీ సమయంలో ఎంతోమందిని అరెస్టులు చేస్తుండగా ఎందరో నాయకులు అజ్ఞాతంలో ఉండి ఉద్యమాన్ని కొనసాగించారని, ఎమర్జెన్సీ రోజుల్లో ఆర్ఎస్ఎస్ పై బ్యాన్ విధించినప్పటికీ స్వయం సేవకులు అందరూ అజ్ఞాతంలో ఉంటూ దేశంలో ఉద్యమాన్ని ఉధృతంగా నడిపారని ఎందరో స్వయం సేవకులు కుటుంబాన్ని సైతం త్యాగం చేసి, సమాజం కోసం ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఎమర్జెన్సీ సంఘటన గురించి తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందన్నారు. ఈసమావేశానంతరం ఆనాడు ఎమర్జెన్సీలో అరెస్టు అయి జైలు కు వెళ్లిన వారిలో కిడాంబి దేవరాజన్, కోటా బ్రహ్మం, భక్తవత్సల రావు లను సన్మానించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షుతన జరిగిన ఈకార్యక్రమంలో బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు, మాస్టర్ మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, కార్యక్రమ కో-కన్వీనర్స్ మార్తా నరేంద్ర, కోట శ్రీనివాస్, నారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, రాచమల్లు భాస్కర్, తాడువాయి రామకృష్ణ, మండల అధ్యక్షులు బెహరా గాయత్రి, మల్లాల లక్ష్మణ్ గౌడ్, వక్కలగడ్డ తిరుమలరావు, తంగా లక్ష్మణ్ రావు, జిల్లా నాయకులు బజరంగ్ రామకృష్ణ, దర్శనపు శ్రీనివాస్, దారా అంబేద్కర్, ఈమని మాధవరెడ్డి, దేసు సత్యన్నారాయణ, యస్వంత్, సురేష్ జైన్, షేక్ సాంబశివ రావు, లక్ష్మీ కుమారి, అనురాధ, శారద, బాబురావు, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐజీ ఆకే.రవి కృష్ణ మరియు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ " సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించున్న "వాకధాన్"





**పెన్ పవర్, గుంటూరు, జూన్. 25**


అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగ మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా "ఈగల్ " - మాదక ద్రవ్యాల నివారణ ప్రత్యేక పోలీస్ విభాగం. ఐజీ ఆకే.రవి కృష్ణ మరియు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ " సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించున్న "వాకథాన్" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి.అనిత .మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ "వాకథాన్" కార్యక్రమం గుంటూరు నగరం, అమరావతి రోడ్డులోని ఫీవర్ ఆస్పత్రి సెంటర్ నుంచి చిల్లీస్ సెంటర్ వరకు జరనున్నది. ఈ అవగాహన ర్యాలీలో ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలసి స్వయంగా పాల్గొనడం జరుగుతుంది. అనంతరం శ్రీ కన్వెన్షన్ లో విద్యార్థులు, యువతతో జరిగే ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శ్రీ కన్వెన్షన్ మరియు ఇతర ప్రాంతాల్లో పోలీస్ అధికారులు చేస్తున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి హోంమంత్రి తగిన ఆదేశాలివ్వడం జరిగింది. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తును, అవగాహన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను చేసినట్టు తెలిపిన ఈగల్ ఐజీ ఆకే. రవికృష్ణ , గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ . ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఈగల్ ఎస్పీ నగేష్ , పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# మత్తు,మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు నిర్వహించిన కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం.


## ప్రపంచంలో విద్య ఒక్కటే శక్తివంతమైన ఆయుధం.

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్, 25**

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నేటి యువత క్షణికమైన మత్తు కోసం విషపూరితమైన మత్తు మాదకద్రవ్యాల వినియోగం కారణంగా జరిగే నష్టాలు కుటుంబపరంగా, సమాజపరంగా ఎదుర్కొనే దుష్పరిణామాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలు పై చర్చించారు. ట్రాఫిక్ రూల్స్ సైబర్ క్రైమ్ (1930) పోక్సో యాక్ట్ , గుడ్ టచ్ మరియు బాడ్ టచ్ విషయాలపై క్లుప్తంగా వివరించారు. మత్తు మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అవి అలవాటు చేసుకున్న వారి జీవితాలు నాశనం అయ్యాయి. మత్తుకి అలవాటు పడితే మెదడు పని చేయడం మనేస్తుందని విద్యార్థులు వాటిపై అవగాహన చేసుకొని మరికొందరికి తెలియజేయడం ద్వారా నిర్మూలన సులువు అవుతుంది. మీరు నిర్మూలనలో భాగస్వాములు అయి బాధ్యత గల పౌరులు అవుతారు. ఇంటి దగ్గర నుండి బయలుదేరి స్కూల్ కి వచ్చే మార్గంలో అనేకమైన వాహనాల మధ్య ప్రయాణం చేయాల్సి



ఉంటుంది. మార్గానికి ఎడమవైపు రావాలని.. మీరే కాకుండా మీతో మీ కుటుంబ సభ్యులకు కూడా హెల్మెట్ ధరించేలా చూడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగించే సమయంలో వాటికి సంబంధించిన సమాచారం గానీ, వ్యక్తిగత వివరాలు గానీ ఎవరికి షేర్ చేయకూడదని, వివరాలన్నీ గోప్యంగా ఉంచుకోవాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మీ యొక్క అకౌంట్లో డబ్బు వ్యక్తిగత విషయాలు దోచుకునేందుకు అనేకమైన మార్గాలలో తమను చేరుకుంటారని వ్యక్తిగత సమాచారాన్ని ఓటీపీ పాస్వర్డ్



తెలియని ఫోన్ నెంబర్ నుంచి వచ్చే లింక్స్ ఓపెన్ చేయకూడదు ఫైల్స్ వంటివి ఓపెన్ చేయకూడదు ఎవరికీ పంచుకోకూడదని గోప్యంగా ఉంచుకోవాలని తెలిపారు. పోకసో చట్టం గురించి గుడ్ టచ్ అండ్ బాడ్ టచ్ గురించి అవగాహన కల్పించినారు. పాఠశాల నుండి అన్ని విషయాల మీద అవగాహన చేసుకొని చురుకుగా ఉండాలి. ఇప్పటి నుండి చదువు మీద మక్కువ, కష్టపడితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అని సూచించారు. విద్య ఉంటే ఏదైనా సాధించవచ్చు.

## గ్రామ సర్వేయర్లు తహసీల్దార్ కి వినతి.

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్, 25**

పెదన మండల పరిధిలోని గ్రామ సర్వేయర్ ఉద్యోగులు తమను సొంత మండలాలకు కాకుండా ఇతర మండలాలకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రేషనలైజేషన్‌ను రద్దు చేసి, ప్రమోషన్లు కల్పించాలని, జీవో. నెంబర్.5 సవరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సొంత మండలాల్లోనే ట్రాన్సఫర్ ఇవ్వాలని కోరుతూ ఇంచార్జ్ తహసీల్దార్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.



## మరణ వార్త ఎంతో బాధించింది..!

-మస్తాన్ వలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..!



**మాచర్ల: జూన్ 25 బుధవారం (పెన్ పవర్ న్యూస్)**

పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మస్తాన్ వలి( 70 ), ఆయన కుమారుడు షేక్ జాకీర్( 35 ) లు అనారోగ్యంతో ఒకే రోజు మృతి చెందారన్న వార్త తన మనసును ఎంతగానో కలచివేసిందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని సవేరా లాడ్జి వీధిలో నివాసం ఉంటున్న మస్తాన్ వలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జూలకంటి, ఆయన తనయుడు గౌతమ్ రెడ్డి, కూటమి పార్టీల పెద్దలు పరామర్శించారు. ఇంటి పెద్దను, ఎదిగిన కుమారుడిని ఒకే రోజు కొల్పోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం వారి కుటుంబానికి ఎమ్మెల్యే జూలకంటి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాచర్ల పట్టణ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకముగా కలిసిన పెడన శాసనసభ్యులు





స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,మచిలీపట్నం, జూన్, 25:

మచిలీపట్నం కృష్ణ యూనివర్సిటీలో జరుగుతున్న కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం విచ్చేశారు. ఆయనను కృష్ణాజిల్లాలోని శాసనసభ్యులు కాకిత కృష్ణ ప్రసాద్,వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు తో పాటు పలువురు శాసనసభ్యులు సీనియర్ టిడిపి నాయకులు తదితరులు గవర్నర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## వాహనాల తనిఖీ చేసిన ఎస్సై





**వేటపాలెం, పెన్ పవర్ ,జూన్ 25 :**

మండల కేంద్రంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద బుధవారం వేటపాలెం ఎస్సై జనార్ధన్ వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, వాహన సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించడం జరిగింది అన్నారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహన సంబంధిత సరైన ధృవపత్రాలు లేకుంటే వారికి చలానా విధించబడినని హెచ్చరించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం చేయటానికి పోలీస్ స్టేషన్ కు 112 బైక్ కేటాయించడం జరిగిందని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ఇరుకైన వీధుల్లో అత్యవసర పరిస్థితుల్లో చేరుకోవడానికి ఈ బైక్ ఎంతో ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# గవర్నర్ అఫ్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం పలికిన విశ్వవిద్యాలయ అధికారులు







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్,25:**

బుధవారం మధ్యాహ్నం నగరంలోని కృష్ణ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన గౌరవ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కు విశ్వవిద్యాలయంలో ఘనంగా స్వాగతం లభించింది. తొలుత రాష్ట్ర గవర్నర్ విశ్వవిద్యాలయం ఫుడ్ కోర్ట్ ప్రాంగణానికి చేరుకోగా రాష్ట్ర మానవ వనరులు అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఆర్.టి.జి మంత్రివర్యులు నారా లోకేష్, రాష్ట్ర కార్మికులు బాయిలర్లు కర్మాగారాలు బీమా వైద్య సేవల శాఖ మంత్రివర్యులు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించి, 3.20 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫుడ్ కోర్ట్ ను మంత్రులతో కలిసి ప్రారంభించారు. తదుపరి రాష్ట్ర గవర్నర్ వైయస్సార్ పరిపాలన భవనంలోని ఉపకులపతి ఛాంబర్ లో కార్యనిర్వాహక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. తదనంతరం రాష్ట్ర గవర్నర్ కార్యనిర్వాహక మండలి సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అక్కడినుండి రాష్ట్ర







గవర్నర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాకు చేరుకుని పోలీసు బ్యాండ్ మేళంతో స్నాతకోత్సవం జరిగే అల్లూరి సీతారామరాజు ఆడిటోరియం కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి హరిజవహర్లాల్, సంయుక్త కార్యదర్శి సూర్య ప్రకాష్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ అదనపు ఎస్పీలు వివి నాయుడు సత్యనారాయణ, మంత్రి లోకేష్ ఓ ఎస్ డి రమణ, ఆర్ డి ఓ కే స్వాతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించిన ప్రత్తిపాటి

శ్రీ కృష్ణదేవరాయ విద్యాభివృద్ధి కమిటీ, ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థలు కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు వర్గాల పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం : ప్రత్తిపాటి.

కూటమిప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతుంది : ప్రత్తిపాటి.





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 25:**



చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే ఆంధ్రప్రదేశ్ దేశం గర్వించేలా అభివృద్ధి చెందుతుందని, అప్పుడే ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ విద్యాభివృద్ధి కమిటీ, ఆంధ్ర ప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాటి మాట్లాడారు. కూటమిపార్టీల కలయిక రాష్ట్రప్రజలకు స్వేచ్ఛా సంతోషాలు తీసుకొచ్చిందన్న ప్రత్తిపాటి, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 67 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం ఒకేరోజు 8,700కోట్లు తల్లుల ఖాతాల్లో జమచేసిన ఘనత చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లకే దక్కుతుందని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పినట్టు ఐక్యతే మనందరి బలమని, ఆయనలానే మిగతా నాయకులు కూడా విశాల ధృక్పథంతో ఆలోచించాలని ప్రత్తిపాటి సూచించారు. గత ప్రభుత్వం ప్రజలు.. నాయకులతో పాటు, సామాజిక వేత్తలు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల్ని కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ప్రత్తిపాటి చెప్పారు. తమ వర్గాల్లోని పేద విద్యార్థుల్ని ప్రోత్సహిస్తూ, వారికి అండగా నిలుస్తున్న శ్రీ కృష్ణదేవరాయ విద్యాభివృద్ధి కమిటీ, ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యుల్ని ప్రత్యక్షంగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించి ఉన్నత చదువుల దిశగా వారిని ప్రోత్సహించడం మంచి నిర్ణయమని ప్రత్తిపాటి కొనియాడారు. కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి తోట రాజారమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, తోట బ్రాహ్మస్వాములు, మిరియాల రత్నా కుమారి, రాయల శ్రీనివాస్, బత్తినేని శ్రీనివాసరావు, రావు సుబ్రమణ్యం, చెన్నకేశేవుల రమేష్, బలిశెట్టి విజయ్ కుమార్, అంకిరెడ్డి రమేష్ తదితరులున్నారు.

## ఇన్నర్‌వీల్ క్లబ్ చిలకలూరిపేటకు 24 అవార్డులు

క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ సేవా, సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు

క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజినికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్ తో పాటు ఎక్సల్లెంట్ సర్వీసు అవార్డ్




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 25:**

చిలకలూరిపేట: స్నేహం, సేవా అనే దృక్పథంతో ఇన్నర్‌వీల్ క్లబ్ పని చేస్తుందని, ఆ దిశగానే ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని అన్నారు. 2024-25 సంవత్సరానికి ఇన్నర్‌వీల్ ఆఫ్ చిలకలూరిపేట క్లబ్ కి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్ ,ఎక్సలెంట్ సర్వీసు అవార్డ్ తో పాటు మొత్తం 24 అవార్డ్స్ అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రికగ్నజేషన్ అవార్డ్స్ సెలబ్రేషన్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత చేతుల మీదుగా ఈ అవార్డులు పొందారు. సంవత్సర కాలంగా చేపట్టిన 103 వివిధ సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ, అవార్డులతో పాటుగా ప్రశంసా ప్రతాలను కూడా అందజేశారు. క్లబ్ ట్రెజరర్ పి రమాదేవి కి కూడా సెలెబ్రేట్ స్టార్ ట్రెజరర్ అవార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ సంవత్స కాలంగా ఇన్నర్‌వీల్ క్లబ్ తరుపున విజయవాడ వరదల సమయంలో సాయం, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, వృద్దులకు చేయూత, బాలికా విద్యకు ప్రధాన్యత నిస్తూ స్కాలర్‌షిప్‌ల అందజేత, ఉచిత వైద్య శిబిరాలు, ట్రైసైకిళ్ల పంపిణి, కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ట్రాన్స్‌జెండర్లకు చేయూత, పేద విద్యార్థులకు ఆర్ధిక సహాయం, ప్రభుత్వాసుపత్రిలో తాగునీటి సదుపాయం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. దాతలు, క్లబ్ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. తనతో పాటు అవార్డులను స్వీకరించటానికి తనతో పాటు డిస్ట్రిక్ట్ చైర్మన్ కోలా విజయలక్ష్మి ,సెక్రటరీ జయలక్ష్మి ఆవార్డుల కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజినిని అభినందించారు.

## కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం..!

-ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**వెల్దుర్తి: జూన్ 25 బుధవారం (పెన్ పవర్ న్యూస్)**

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కారంపూడి మండలం, ఒప్పిచర్ల కు చెందిన టీడీపీ కార్యకర్త కోట కోటయ్య మృతి చెందాడు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం తీసుకున్న కోటయ్య కుటుంబ సభ్యులకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి ప్రమాద భీమా రూ. 5 లక్షల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టాలను ఎరిగి, నిత్యం వారి అభ్యున్నతి కోసం పార్టీ అధినేత చంద్రబాబు పరితపిస్తూ ఉంటారని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తను ఆపత్కాలంలో భీమా ద్వారా ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కొల్పొయిన కుటుంబాలకు పార్టీ ప్రమాద భీమా కొంతమేరకు అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కారంపూడి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: పోట్ల నరసింహారావు



కారంపూడి : జూన్ 25 (పెన్ పవర్ న్యూస్)

కారంపూడి మండలంలో నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని పోట్ల. నరసింహారావు తెలిపారు. మండల వ్యవసాయాధికారి పోట్ల. నరసింహారావు ఈ సందర్భంగా పట్టణంలోని పలు విత్తన షాప్ లను తనిఖీ చేపట్టారు. విత్తన నిల్వలు బిల్లు, పుస్తకాలు, కొనుగోలు మరియు అమ్మకాల రసీదులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేని ప్రత్తి విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. గరిష్ట ధర కంటే అధిక రేట్లకు అమ్మితే రైతులు మండల వ్యవసాయాధికారికి తెలియజేయాలని కోరారు . రైతులు తప్పని సరిగా షాపుల నుండి కొన్న విత్తనాలకు సంభందిచిన బిల్లులు తీసుకొని, భద్రపరచు కోవాలని చెప్పారు. విత్తన దుఖానాదారులు వారికి వొచ్చిన విత్తనాల కు సంభందించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారికి తెలియజేయలని తెలిపారు. ఎక్కడైనా అనధికారికంగా విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే, రైతులు ఆ సమాచారాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారికి వెంటనే తెలియజేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి మరియు రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎల్లప్పుడూ అదుబాటులో ఉంటామని తెలియజేశారు.

# అనిల్ అంబానీ దూకుడు.. డిఫెన్స్ రంగంలో మరో డీల్, దూసుకుపోతున్న స్టాక్ అదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** అనిల్ అంబానీ ఒకప్పుడు డిఫెన్స్ రంగంలోకి అడుగుపెట్టాలని తీసుకున్న నిర్ణయం ఇన్నాళ్లకు ఫలవంతంగా మారుతోంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు వ్యాపార ప్రపంచంతో కొంత దూరం మెయింటెన్ చేసిన అనిల్ అంబానీ దివాలా తర్వాత సెకెండ్ ఇన్నింగ్స్ మాత్రం సరైన దారిలో ఆడుతున్నారని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ ఫ్రాకి అనుబంధ సంస్థ రూ.600 కోట్ల విలువైన రక్షణ రంగ డీల్ కుదుర్చుకుంది. దీంతో రిలయన్స్ ఇన్ ఫ్రా కంపెనీ షేర్లు నేడు 5 శాతం అప్పర్ సర్క్యూట్ తాకి ఒక్కోటి రూ.404.05 స్థాయికి చేరుకున్నాయి. చాలా కాలంగా అనిల్ అంబానీ డిఫెన్స్ రంగంలో కొనసాగిస్తున్న విజయ పరంపర రిలయన్స్ ఇన్ ఫ్రా షేర్లను క్రమంగా పెంచుతోంది.డీల్ వివరాలను పరిశీలిస్తే.. రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ తన రక్షణ అనుబంధ సంస్థ రిలయన్స్ డిఫెన్స్, ప్రముఖ జర్మన్ రక్షణ తయారీదారు రీన్‌మెటాల్ నుంచి రూ.600 కోట్ల విలువైన ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. దీంతో అనిల్ అంబానీ సంస్థ పేరు మరోసారి వార్తల్లో ప్రధానంగా నిలిచింది.

# CBSE కీలక నిర్ణయం:10వ తరగతి బోర్డు పరీక్షలు ఏడాదికి రెండుసార్లు.. 2026 నుంచి అమలు




**హైదరాబాద్ పెన్ పవర్:** సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) కీలక నిర్ణయం తీసుకుంది. 10వ తరగతి బోర్డు పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలని నిర్ణయించింది.2026 విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించి వారికి మెరుగైన అవకాశాలను కల్పించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నిర్ణయం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (NEP) 2020 సిఫార్సులకు అనుగుణంగా తీసుకున్నారు. 2026 విద్యా సంవత్సరం నుంచి ఈ కొత్త విధానం అమలులోకి వస్తుంది. మొదటి దశ పరీక్షలు సాధారణంగా ఫిబ్రవరిలో జరుగుతాయి. రెండవ దశ పరీక్షలు మే నెలలో నిర్వహిస్తారు. విద్యార్థులు మొదటి దశ పరీక్షలకు హాజరు కావడం తప్పనిసరి. రెండవ దశ పరీక్షలకు హాజరు కావడం విద్యార్థుల ఐచ్ఛికం. విద్యార్థులు తమ మార్కులను పెంచుకునేందుకు లేదా మొదటి దశలో ఉత్తీర్ణత సాధించని వారు ఈ పరీక్షలకు హాజరు కావచ్చు. విద్యార్థులు రెండు పరీక్షలకు హాజరైనట్లయితే వారి అత్యుత్తమ స్కోరును తుది ఫలితాల కోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఇది %జీజుజు% మెయిన్ పరీక్షల విధానాన్ని పోలి ఉంటుంది. పేపర్ వ్యాల్యూవేషన్.. విద్యాసెషన్ లో ఏడాదికి ఒకేసారి మాత్రమే వ్యాల్యూవేషన్ ఉంటుంది. విద్యార్థులపై బోర్డు పరీక్షల ఒత్తిడిని తగ్గించడం..వారికి అదనపు అవకాశం కల్పించడం..నేర్చుకునే వాతావరణాన్ని మరింత అనుకూలంగా మార్చడం లక్ష్యంగా ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ మార్పుతో విద్యార్థులు ఒకే పరీక్షా ఫలితంపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు రెండు అవకాశాలను పొందుతారు.పదవ తరగతి బోర్డు ఎగ్జామ్స్ ఏడాదికి రెండు సార్లు నిర్వహించేందుకు ఫిబ్రవరిలోనే CBSE ముసాయిదా నిబంధనలను ప్రకటించింది. వీటిని విద్యార్థులు, పేరెంట్స్ అభిప్రాయం కోసం అందుబాటులో ఉంచారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు విద్యార్థులందరు ఏదైనా విద్యా సంవత్సరంలో రెండుసార్లు పరీక్షలు రాసుకునేందుకు అనుమతించాలని కొత్త జాతీయ విద్యావిధానం(NEP) సిఫార్సు చేసింది.

# అమెరికాను తాకగలిగే మిస్సైల్స్ తయారీలో పాక్... ట్రంప్ ఎక్కడ?



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ తో శత్రుత్వం ప్రమాదం.. స్నేహం ప్రాణాంతకం అనేది నానుడి! ఈ విషయం ట్రంప్ కి తెలియంది కాదు. అయినప్పటికీ ఇరాన్ యుద్ధంలో అవసరం పడుతుందేమోనని భావించి ఐ లవ్ యూ అని అనేశారు! కట్ చేస్తే... అమెరికాలోని పలు లక్ష్యాలను తాకగలిగే సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ఆ దేశం రహస్యంగా అభివృద్ధి చేస్తోందని తెలుస్తోంది.అవును... ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాకిస్థాన్ రహస్యంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాషింగ్టన్ లోని నిఘా సంస్థలు ఈ విషయాన్ని వెల్లడించాయి. వీటికి 5,500 కి.మీ. కంటే ఎక్కువదూరం ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఉంటుందని అంటున్నారు. దీంతో.. ఈ విషయం ఒక్కసారిగా సంచలనంగా మారింది.ఈ నేపథ్యంలో తాజాగా యూఎస్ నిఘా సంస్థలు రూపొందించిన నివేదికల ప్రకారం... పాకిస్థాన్ లోని ఉగ్రసంస్థలే లక్ష్యంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ తర్వాత.. చైనా సహాయంతో తమ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవాలని ఇస్లామాబాద్ భావించింది. అందుకు అనుగుణంగానే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను రహస్యంగా అభివృద్ధి చేస్తోంది.ఇవి అమెరికాలోని పలు లక్ష్యాలను తాకగలిగే సామర్థ్యం కలిగి ఉంటాయి. అయితే... అలాంటి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాకిస్థాన్ అభివృద్ధి చేయాలని గానీ, కొనుగోలు చేయాలని గానీ ప్రయత్నిస్తే.. ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికాకు చెందిన అధికారులు పేర్కొన్నట్లు ఆ నివేదికలో వెల్లడించింది.ఇదే సమయంలో... అమెరికాకు ముప్పును కలిగించేలా లేదా అణ్వాయుధాలు కలిగిఉన్న ఏ దేశాన్ని అయినా అగ్రరాజ్యం తన ప్రత్యర్థిగా ప్రకటిస్తుందని ఆ నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా శత్రువులుగా పరిగణిస్తోందని వెల్లడించింది. దీంతో.. పాకిస్థాన్ వ్యవహారానికి సంబంధించిన విషయం సంచలనంగా మారింది.కాగా... కొంతకాలంగా పాకిస్థాన్ స్వల్ప, మధ్యస్థ శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేయడంపై దృష్టిసారించిందని చెబుతున్నారు. అయితే.. ఇప్పటివరకూ ఆ దేశం దగ్గర ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు లేవు. ఈ క్రమంలో... గతేడాది పాకిస్థాన్ లాంగ్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి అమెరికా పలు ఆంక్షలు పెట్టింది.ఇదే సమయంలో... ఈ క్షిపణి కార్యక్రమాన్ని పర్యవేక్షించే ప్రభుత్వ యాజమాన్యంలోని రక్షణ సంస్థ నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్, మరో మూడు సంస్థలతోను అమెరికన్ సంస్థలు వ్యాపారం చేయకుండా నిషేధించింది. అటువంటి మిస్సైల్స్ ను పాక్ తయారుచేయడం తమకు ముప్పేనని తెలిపింది. అయితే, ఈ నిషేధంపై అప్పట్లో పాకిస్థాన్ పలు విమర్శలు చేసింది.ఈ నేపథ్యంలో తాజాగా రహస్యంగా న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని పాకిస్థాన్ మొదలుపెట్టిందని వాషింగ్టన్ లోని నిఘా సంస్థలు పేర్కొనడంతో.. దీనిపై వైట్ హౌస్ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తిగా మారింది.

# చైనా గబ్బిలాల్లో ప్రాణాంతక 20 వైరస్‌లు : వీటిలో రెండు కోవిడ్ కంటే ప్రమాదకరం



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనాలోని గబ్బిలాల్లో కొత్తగా 20 ప్రాణాంతకమైన వైరస్‌లను కనుగొన్నారు శాస్త్రవేత్తలు. చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లోని గబ్బిలాలలో ఈ కొత్త వైరస్‌లను శాస్త్రవేత్తలు కనుగొన్నట్లు ఒక కొత్త అధ్యయనం తెలిపింది. మొత్తం 22 రకాల వైరస్‌లను గుర్తించగా వీటిలో 20 వైరస్‌లు గతంలో ఎన్నడూ చూడనివి.

కొత్తగా కనుగొనబడిన వైరస్‌లలో రెండు హేనిపావైరస్‌లు ఉన్నాయి.ఈ వైరస్‌లలో ప్రాణాంతక రెండు హెంద్రా ,నిపా వైరస్‌లకు జన్యుపరంగా దగ్గరి పోలికలున్నాయి. ఇవి గతంలో మానవులు, జంతువులలో తీవ్రమైన వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యాయి.

**ఈ వైరస్ లంటే ఎందుకు అంత భయం?**

ఈ కొత్త హేనిపావైరస్‌లు ఎక్కువగా గబ్బిలాల కిడ్నీలలో గుర్తించారు శాస్త్రవేత్తలు. కిడ్నీలు మూత్రాన్ని ఉత్పత్తి చేస్తాయి కాబట్టి గబ్బిలాలు మూత్ర విసర్జన చేసినప్పుడు అవి పండ్లు లేదా నీటిని కలుషితం చేసే అవకాశం ఉంది. ఈ కలుషితమైన వాటిని మనుషులు లేదా ఇతర జంతువులు తీసుకుంటే వారికి వైరస్ సోకే ప్రమాదం ఉంది.ఈ గబ్బిలాలు పండ్ల తోటలు, గ్రామాల సమీపంలో నివసించాయి. ఇది మనుషులు ,జంతువులకు వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదాన్ని పెంచుతుందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

చైనాలోని యునాన్ ప్రావిన్స్ లో ఈ పరిశోధనలు జరిగాయి. పీర్-రివ్యూడ్ జర్నల్ PLOS పాథోజెన్స్‌లో ప్రచురించిన ఈ పరిశోధనలో 2017 నుంచి 2021 మధ్య 142 గబ్బిలాల నుంచి కిడ్నీల కణజాల నమూనాలను సేకరించి పరిశోధనలుచేశారు శాస్త్రవేత్తలు. వైరస్‌లు, బ్యాక్టీరియా ,కొత్త పరాన్నజీవిని గుర్తించేందుకు శాస్త్రవేత్తలు జన్యు పరీక్షను ఉపయోగించారు.కొత్తగా కనుగొనబడిన వైరస్‌లలో రెండు హేనిపావైరస్‌లు (Henipaviruses) ఉన్నాయి. ఇవి ఇప్పటికే మానవులలో ,జంతువులలో తీవ్రమైన వ్యాధులు, అధిక మరణాలకు కారణమైన హెంద్రా (Hendra) , నిపా (Nipah) వైరస్‌లకు జన్యుపరంగా చాలా దగ్గరగా ఉన్నాయి.

ALSO READ 200 కోట్ల మందికి అందని మంచి నీరు.. ఆ దేశాల్లో ఎక్కువగా సమస్య..నిపుణుల హెచ్చరిక: ఈ వైరస్‌లు తీవ్రమైన జెనోటిక్ థ్రీట్స్ కలిగి ఉన్నాయని పరిశోధకులు హెచ్చరించారు. అంటే అవి జంతువుల నుంచి మానవులకు సులభంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీటిపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం

ఉందని అంటున్నారు నిపుణులు.కొత్త వైరస్‌లు మానవులకు చేరే ముందు జంతువులలో వ్యాప్తి చెందడాన్ని అబ్జర్వ్ చేయడానికి ఇలాంటి మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు విశ్వసిస్తున్నారు.

ఈ అధ్యయనంలో ఒక కొత్త పరాన్నజీవి (Klossiella yunnanensis) , రెండు కొత్త బ్యాక్టీరియా జాతులను కూడా కనుగొన్నారు. ఈ పరిశోధన గబ్బిలాలలో వైరస్‌ల వైవిధ్యాన్ని ,మానవులకు సంక్రమించే ప్రమాదాలను మరోసారి స్పష్టం చేస్తుంది. భవిష్యత్ మహమ్మారులను నివారించేందుకు ఇటువంటి అధ్యయనాలు చాలా కీలకమైనవి.

# న్యూస్ రాగానే ట్రంప్ కిందా మీదా... ఏమిటీ బాధ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న పలు సంఘర్షణలు, వరుస యుద్ధాలు ఆపుతున్నానన్న సంతోషంలో, సంబరాల్లో ఉన్నారు డొనాల్డ్ ట్రంప్. వీటివల్ల తనకు నోబెల్ శాంతి బహుమతి కూడా వచ్చేలా ఉందనే ఆశల పల్లకిలోనూ ఊయలూగుతున్నట్లు కనిపిస్తున్నారు! ఈ నేపథ్యంలో తాజాగా తెరపైకి వచ్చిన ఓ నివేదిక ట్రంప్ ను టెన్షన్ పెడుతోందని చెబుతున్నారు.అవును... ఇరాన్ పై దాడులు చేసేశాం.. ఇజ్రాయెల్ మొదలుపెట్టిన ఆపరేషన్ రైజింగ్ లయన్ కు ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్ తో సూపర్ ఫినిషింగ్ ఇచ్చాం.. అదే సమయంలో ఇరు దేశాల మధ్య సీజ్ ఫైర్ అంగీకారం నెలకొల్పాం.. అనుకున్న అని లక్ష్యాలను పూర్తి చేశాం అనే ఆనందంలో ట్రంప్ ఉన్నారని అంటున్నారు. ఆయన కూడా బలంగా క్లెయిం చేసుకుంటున్నారు.సరిగ్గా ఈ సమయంలో... ట్రంప్ కి ఒక చేదు విషయం చెప్పే నివేదిక ఒకటి వెలువడింది. ఇందులో భాగంగా... ఇరాన్ లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలపై అమెరికా భారీ దాడులకు పాల్పడగా.. ఆ దాడుల్లో ఫోర్డో, నతాంజ్ లు పూర్తిగా నాశనం కాలేదు అంటూ పెంటగాన్ కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఓ నివేదిక తెరపైకి వచ్చింది.ఇదే సమయంలో... యురేనియం శుద్ధి చేసేందుకు ఉపయోగించే సెంట్రిఫ్యూజ్ లు వంటి కీలక పరికరాలను ఇరాన్ కొన్ని నెలల్లోనే తిరిగి ప్రారంభించుకోవచ్చని ఆ నివేదిక పేర్కొన్నట్లు సీ.ఎన్.ఎన్. తమ కథనంలో రాసుకొచ్చింది. దీంతో... ట్రంప్ కారాలు మిరియాలు నూరుతూ.. కిందా మీదా పడుతున్నారని అంటున్నారు. ఈ సమయంలో ట్రంప్ ట్రూత్ లో ఓ పోస్ట్ పెట్టారు.ఇందులో భాగంగా... అవన్నీ నకిలీ వార్తలు.. చరిత్రలో అత్యంత విజయవంతమైన సైనిక దాడుల తీవ్రతను తగ్గించేందుకు కొన్ని వార్తా సంస్థలు చేస్తున్న ప్రయత్నం ఇది.. ఆయా వార్తా సంస్థలను ప్రజలు నమ్మడం లేదు.. ఇరాన్ లోని అణు కేంద్రాలు పూర్తిగా నాశనమయ్యాయి అంటూ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చారు.ఇదే సమయంలో... వైట్ హౌస్ కూడా ఈ విషయంపై స్పందించింది. ఇందులో భాగంగా... ఇలాంటి అసత్య కథనాలు అధ్యక్షుడు ట్రంప్ ను కించపరచడమేనని.. ఇరాన్ అణుకార్యక్రమాన్ని నిర్మూలించిన యుద్ధ పైలట్ల ధైర్యసాహసాలను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నమే ఇదని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ పేర్కొన్నారు.దీంతో... పెంటగాన్ కు

చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఇచ్చిన నివేదిక, దీనిపై సీ.ఎన్.ఎన్. రాసిన కథనం ట్రంప్ ను బాగా చికాకు పెట్టినట్లున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనికి తోడు ఇప్పటికే ఇరాన్ అణుపరీక్షలు జరిపిందనే వార్తలు కూడా ట్రంప్ ను కిందా మీదా పడేస్తున్నాయని అంటున్నారు.

# పరారీలో మరో నటుడు.. డ్రగ్స్ కేసులో గాలిస్తున్న పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళ సినీ పరిశ్రమను మరోసారి డ్రగ్స్ కేసు కుదిపేస్తోంది. ఇప్పటికే నటుడు శ్రీరామ్ అరెస్ట్ కావడం.. ఆయన విచారణలో మరో ప్రముఖ నటుడు కృష్ణ పేరు బయటపడటం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రస్తుతం కృష్ణ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఈ కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

**శ్రీరామ్ అరెస్ట్‌తో వెలుగులోకి డ్రగ్స్ వ్యవహారం**

ఈ నెల 23న చెన్నైలోని నుంగంబాక్కం పోలీసులు నటుడు శ్రీరామ్‌ను డ్రగ్స్ వినియోగం, పంపిణీ ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మాజీ ఏఐఏడీఎంకే ఐటీ విభాగ సభ్యుడు టి. ప్రసాద్ ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రసాద్, శ్రీరామ్‌కు కొకైన్ సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి.

**విచారణలో బయటపడిన కృష్ణ పేరు**

శ్రీరామ్‌ను సుమారు తొమ్మిది గంటల పాటు విచారించిన పోలీసులు పలు కీలక విషయాలు రాబట్టారు. డ్రగ్స్ వినియోగంలో తనతో పాటు ఉన్న కొంతమంది ప్రముఖుల పేర్లను శ్రీరామ్ వెల్లడించినట్లు సమాచారం. ఈ జాబితాలో ప్రముఖ తమిళ సినీ నటుడు కృష్ణ పేరు కూడా ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**కృష్ణ పరారీ.. ముమ్మర గాలింపు చర్యలు**

నటుడు కృష్ణ ప్రస్తుతం కేరళలో షూటింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శ్రీరామ్ అరెస్ట్ అయిన వెంటనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో చెన్నై పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కృష్ణ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

**కోలీవుడ్, టాలీవుడ్ మధ్య అనుమానాలు**

నటుడు కృష్ణకు తమిళ చిత్ర పరిశ్రమలోని పలువురు యువ దర్శకులు, సంగీత దర్శకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిసింది. అంతేకాకుండా, టాలీవుడ్‌కు చెందిన కొంతమంది నటులతో కూడా పరిచయాలు ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో రెండు ఇండస్ట్రీల మధ్య డ్రగ్స్ నెట్‌వర్క్ ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**సినీ పరిశ్రమను వెంటాడుతున్న డ్రగ్స్ భయం**

ఈ కేసు తాలూకు పరిణామాలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా కలకలం రేగింది. ఇప్పటికే డ్రగ్స్ కేసులతో పలువురు యువ నటులు, సంగీత దర్శకులు పోలీసుల నిఘాలో ఉన్నట్లు తెలుస్తోంది. సినీ పరిశ్రమలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోందన్న వాదనలు తాజా కేసుతో మరింత బలం పుంజుకున్నాయి. ండ్రగ్స్ కేసులో నిత్యం కొత్త పేర్లు వెలుగులోకి వస్తుండటంతో సినిమా పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పోలీసుల దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని సంచలనాత్మక పేర్లు బయటపడే అవకాశముంది. సినీ రంగాన్ని ఈ మత్తు మాయ విపత్తు ఎటు దారి మళ్లిస్తుందో వేచి చూడాలి.

# కంగారులకు అగ్ని పరీక్ష: స్మిత్, లాబుస్చాగ్నే లేకుండా ఆస్ట్రేలియా ప్లేయింగ్ 11



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ ఓటమి తర్వాత ఆస్ట్రేలియా తొలి టెస్ట్ సిరీస్ ఆడబోతుంది. బుధవారం (జూన్ 25) వెస్టిండీస్ తో తొలి టెస్ట్ కు సిద్ధమైంది. 2025-27 టెస్ట్ ఛాంపియన్స్ షిప్ లో భాగంగా ఇరు జట్లకు ఇదే తొలి సిరీస్. బలహీనమైన వెస్టిండీస్ ను ఆస్ట్రేలియా చిత్తు చేయాలని భావిస్తుంటే.. స్వదేశంలో వెస్టిండీస్ ఆస్ట్రేలియాకు షాక్ ఇవ్వాలని చూస్తుంది. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్‌లో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఆసీస్ కు కమ్మిన్స్ కెప్టెన్ గా కొనసాగనుండగా.. కొత్త కెప్టెన్ రోస్టన్ ఛేజ్ తొలిసారి వెస్టిండీస్ కు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు ఇప్పటికే ప్లేయింగ్ 11 ప్రకటించాయి. ఆస్ట్రేలియా తుది జట్టు విషయానికి వస్తే మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, లాబుస్చాగ్నే లేకుండానే విండీస్ తో కంగారూల జట్టు టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. నాలుగేళ్లుగా ఆసీస్ జట్టులో రెగ్యులర్ గా ఉంటూ ఎన్నో కీలక ఇన్నింగ్స్ లు ఆడిన మార్నస్ పై ఫైనల్ గా సెలక్టర్లు కొరడా ఝులిపించారు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్లో రెండు ఇన్నింగ్స్ (17,22) ల్లో విఫలం కావడంతో అతడిని వెస్టిండీస్ తో టెస్ట్ సిరీస్ కు ఎంపిక చేయలేదు. లాబుస్చాగ్నేతో పాటు స్టీవ్ స్మిత్ తొలి టెస్టుకు ఎంపిక కాలేదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్లో బవుమా క్యాచ్ అందుకునే క్రమంలో స్మిత్ చేతి వేలికి గాయమైంది. దీంతో స్మిత్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. ఉస్మాన్ ఖవాజాతో పాటు 19 ఏళ్ళ కుర్రాడు సామ్ కాన్స్టాస్ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నాడు. కామెరాన్ గ్రీన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. స్మిత్ స్థానంలో వచ్చిన జోష్ ఇంగ్లిస్ నాలుగో స్థానంలో బరిలోకి దిగుతాడు.

ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కారీ వరుసగా ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో బ్యాటింగ్ కు వస్తారు. కెప్టెన్ పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్ ఫస్ట్ బౌలర్లుగా కొనసాగనున్నారు. నాథన్ లియాన్ ఏకైక స్పిన్నర్ గా బరిలోకి దిగుతాడు. వెస్టిండీస్ 6 గురు బ్యాటర్లు.. ఒక స్పిన్ ఆల్ రౌండర్.. ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్.. ముగ్గురు పేసర్లతో ప్లేయింగ్ 11 ప్రకటించింది.

**వెస్టిండీస్ (ప్లేయింగ్ XI):**
క్రెయిగ్ బ్రాత్‌వైట్, బ్రాండన్ కింగ్, జాన్ కాంప్‌బెల్, షై హోప్ (వికెట్ కీపర్), కీసీ కార్టీ, జస్టిన్ గ్రీవ్స్, రోస్టన్ చేజ్(కెప్టెన్), జోమెల్ వారికన్, అల్జారి జోసెఫ్, షమర్ జోసెఫ్, జేడెన్ సీల్స్

**ఆస్ట్రేలియా (ప్లేయింగ్ XI):**
ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్స్టాస్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హాజిల్‌వుడ్

# టీమిండియాతో టెస్ట్ సిరీస్.. సచిన్, ద్రవిడ్ ఆల్‌టైం రికార్డ్స్‌పై రూట్ కన్ను



**హైదరాబాద్ పెన్ పవర్:** టెస్టుల్లో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఆల్ టైం రికార్డ్ ఒకటి ప్రమాదంలో పడింది. టెస్టు ఫార్మాట్ లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ రికార్డ్ ను ఇంగ్లాండ్ క్రికెటర్ జో రూట్ అధిగమించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. 13 వేల పరుగుల క్లబ్ లోకి చేరుకున్న రూట్.. మరో మూడేళ్లు తన సూపర్ ఫామ్ ను కొనసాగిస్తే సచిన్ రికార్డ్ బ్రేక్ చేసి సరికొత్త చరిత్ర సృష్టిస్తాడు. అయితే అంతకంటే ముందు రూట్ మరో సచిన్ మరో ఆల్ టైం రికార్డ్ పై గురి పెట్టాడు. రూట్ టెస్టుల్లో తన పరుగుల ప్రవాహాన్ని కొనసాగిస్తున్నాడు. లీడ్స్ వేదికగా ఇండియాతో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో 53 పరుగులు చేసి ఇంగ్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. రూట్ కు ఇది టెస్టుల్లో 66 వ హాఫ్ సెంచరీ. కాగా.. ఈ ఫిఫ్టీతో వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చంద్రపాల్ సమం చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఓవరాల్ గా టెస్ట్ క్రికెట్ లో 68 హాఫ్ సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. టీమిండియాతో ఇంగ్లాండ్ మరో నాలుగు టెస్ట్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. మొత్తం నాలుగు నుంచి 8 ఇన్నింగ్స్ ఆడే ఛాన్స్ రూట్ కు రావచ్చు. వీటిలో ఒక మూడు హాఫ్ సెంచరీలు చేసిన టెస్ట్ క్రికెట్ లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఆటగాడిగా రూట్ చరిత్ర సృష్టిస్తాడు. సచిన్ పరుగుల రికార్డ్ విషయానికి వస్తే రూట్ మరో 2834 పరుగులు చేయాలి.

**టెస్ట్ క్రికెట్ లో అత్యధిక హాఫ్ సెంచరీలు:**
సచిన్ టెండూల్కర్68
జో రూట్66
శివనారాయణ్ చంద్రపాల్66
రాహుల్ ద్రవిడ్63
అలన్ బోర్డర్63
రికీ పాంటింగ్62

**రాహుల్ ద్రవిడ్ తో సమంగా:**
అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ లో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఫీల్డర్ గా చరిత్ర సృష్టించడానికి రూట్ సిద్ధమయ్యాడు. ప్రస్తుతం రాహుల్ ద్రవిడ్ తో కలిసి 210 క్యాచ్ లతో సంయుక్తంగా టాప్ లో ఉన్నాడు. రూట్ మరో క్యాచ్ పడితే టెస్ట్ క్రికెట్ లో ఒక ఫీల్డర్ గా ద
అత్యదిక క్యాచ్ లు పట్టిన ప్లేయర్ గా నిలుస్తాడు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియా సిరీస్‌లో రూట్ ద్రవిడ్‌ను అధిగమించే అవకాశం ఉంది.

# హెడింగ్లీ టెస్టులో భారత్ ఓటమికి ఐదు కారణాలు.. అవి ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శుభమన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు ఓటమి పాలైంది. ఆరంభం అదిరినప్పటికీ ఆ తర్వాత పట్టు సడలించిన భారత జట్టు అందుకు మూల్యం చెల్లించుకుంది. బ్యాటింగ్ లైనప్ రెండుసార్లు కుప్పకూలడం, కీలకమైన క్యాచ్‌లను జారవిడవడం, బౌలింగ్ విభాగంలో వైవిధ్యం కొరవడటం వంటి అంశాలు భారత్ ఓటమికి ప్రధాన కారణమయ్యాయి. ఈ లోపాలను చక్కగా సద్వినియోగం చేసుకున్న ఇంగ్లాండ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. భారత టెస్టు క్రికెట్‌లో మార్పు సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు లేని యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు శుభ్‌మన్ గిల్ సారథ్యం వహించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు సాధించడంతో భారత్ 471 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించినట్లేనని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత వరుస వైఫల్యాలు జట్టును దెబ్బతీశాయి. పదేపదే బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలడం, ఫీల్డింగ్‌లో తప్పిదాలు, చివరి ఇన్నింగ్స్‌లో బౌలర్లు తేలిపోవడంతో ఇంగ్లాండ్ జట్టు 371 పరుగుల భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి విజయాన్ని అందుకుంది.

**బ్యాటింగ్ వైఫల్యాలు**
భారత్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ సెంచరీలతో చెలరేగడంతో ఒక దశలో 430/3 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, ఆ తర్వాత కేవలం 41 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లను కోల్పోయింది. 600 పరుగులు దాటుతుందని భావించిన స్కోరు 471 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇదే కథ పునరావృతమైంది. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ రాణించడంతో 333/5 స్కోరుతో మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో మరోసారి కుప్పకూలిన భారత్, అదనంగా 77 పరుగులు మాత్రమే జోడించి 364 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్, చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది.


**కీలక సమయాల్లో ఫీల్డింగ్ తప్పిదాలు**
రెండు ఇన్నింగ్స్‌లలోనూ భారత ఫీల్డింగ్ పేలవంగా ఉంది. ముఖ్యంగా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగు కీలక క్యాచ్‌లను జారవిడిచాడు. బెన్ డకెట్ 97 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను జైస్వాల్ వదిలేయడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఆ తర్వాత డకెట్ 149 పరుగులు చేసి ఇంగ్లండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రతీ క్యాచ్ డ్రాప్ తర్వాత భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నట్లు స్పష్టంగా కనిపించింది. కేవలం జైస్వాల్ మాత్రమే కాకుండా, స్లిప్‌లోనూ క్యాచ్‌లు నేలపాలయ్యాయి. అవుట్ ఫీల్డర్లు బంతిని అంచనా వేయడంలో తడబడ్డారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ కూడా కీలక సమయాల్లో వికెట్ల వెనుక తేలిపోయాడు. ఐదో రోజు పిచ్‌పై ప్రతీ పరుగూ కీలకమైన తరుణంలో ఇటువంటి తప్పిదాలు ఇంగ్లాండ్ కు అనేక లైఫ్‌లైన్‌లు ఇచ్చాయి.

# రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టేలా అమ్మడి ప్లాన్..?



మిస్ వరల్డ్ 2025 కోసం ఎరుపు రంగులో మానుషి చిల్లర్ సిజిల్స్







గులాబీ తుఫానులో మెరుస్తున్న రీతూ వర్మ

కన్నడ పరిశ్రమలో ఆరేళ్ల క్రితమే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది అందాల భామ రుక్మిణి వసంత్. హిందీలో అప్ స్టార్స్ అనే సినిమాలో ఎన్.జి.ఓ గర్ల్ గా కనిపించిన రుక్మిణి కన్నడలో బర్ బల్ ట్రియాలజీ కేస్ 1 ఫైండింగ్ వజ్రముని సినిమాలో నటించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి రక్షిత్ శెట్టి సప్త సాగరాలు దాటి సినిమాలో ఛాన్స్ పట్టేసింది. సప్త సాగరాలు దాటి రెండు భాగాల్లో రుక్మిణి వసంత్ యాక్టింగ్ అదరగొట్టేసింది. సినిమాలో ఆమెను చూసిన యూత్ ఆడియన్స్ అంతా ఆమెకు ఫిదా అయ్యారు. సప్త సాగరాలు దాటి సినిమా తర్వాత రుక్మిణి వసంత్ సౌత్ ఆడియన్స్ కి హాలిలిట్ ఫేవరెట్ అయ్యింది. అమ్మడికి వరుసగా ఇతర భాషల నుంచి ఛాన్స్ లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళ్ లో విజయ్ సేతుపతితో ఏస్ సినిమా చేసిన రుక్మిణి వసంత్ శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాలో కూడా అవకాశం అందుకుంది. ఇక తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో వచ్చినా ఆ సినిమా ఎవరు పట్టించుకోలేదు. లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. నీల్ తో సినిమా అది కూడా ఎన్టీఆర్ లాంటి స్టార్ తో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. తప్పకుండా రుక్మిణి సౌత్ సినిమాల్లో తన ఇంపాక్ట్ గట్టిగా చూపించేలా ఉందని అనిపిస్తుంది. తనకు యూత్ ఆడియన్స్ లో ఏర్పడిన క్రేజ్ చూస్తే సరిగ్గా ఒక్క బ్లాక్ బస్టర్ పడితే ఇక అమ్మడిని తీసుకెళ్లి టాప్ ప్లేస్ లో పెట్టేలా ఉన్నారు. ఆల్రెడీ కన్నడ నుంచి వచ్చి రష్మిక టాలీవుడ్ ని మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ సెన్సేషన్ గా మారింది. ఇక ఇప్పుడు రష్మిక తర్వాత రుక్మిణి అదే రేంజ్ ఫాం కొనసాగించాలని చూస్తుంది. రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టే ప్లానింగ్ లో భాగంగానే రుక్మిణి స్టార్ ఛాన్స్ లు పట్టేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా తప్పకుండా రుక్మిణికి ఆ ఛాన్స్ ఉందనే అనిపిస్తుంది. రుక్మిణి వసంత్ చేస్తున్న ఎన్టీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొడితే మాత్రం అమ్మడికి ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఇదే కాదు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా లైన్ లో ఉన్నట్టు తెలుస్తుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com